ఘనంగా సావిత్రీబాయి పూలే జయంతి



» నివాళులర్పించిన దళిత సంఘాల నాయకులు

3లో

సావిత్రీబాయి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దళిత సంఘాల నాయకులు

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



కుమరం భీం

20

గురువారం 4 జనవరి 2018

» ఎమ్మెల్యేలకు ప్రతిష్ఠాత్మకంగా స్థానిక ఉప ఎన్నికలు

» వచ్చే ఎన్నికలపై ఫలితాల ప్రభావం

» అన్ని పార్టీలకూ తప్పని పరిస్థితి

» నెట్నూరు ఎంపీటీసీ ఏకగ్రీవం?

» కౌటాలపైనే అందరి దృష్టి

» చక్రం తిప్పుతున్న నేతలు

(ఆంధ్రజ్యోతి, ఆసిఫాబాద్)

ఆట మొదలైంది..





కౌటాలలో నామినేషన్ పత్రాలను అధికారులకు అందజేస్తున్న టీఆర్ఎస్ అభ్యర్థి పసునూరి స్వప్న (ఫైల్)

6లో

సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్నాయి. అంతకుముందే అనివార్యంగా వచ్చిపడిన స్థానిక ఉపఎన్నికలు అధికార పార్టీకి పరీక్షగా మారాయి. ముఖ్యంగా ఎమ్మెల్యేలకు ప్రతిష్ఠాత్మకంగా మారాయి. ఫలితాల్లో ఏమాత్రం తేడా వచ్చినా రానున్న సార్వత్రిక ఎన్నికలపై ప్రభావం చూపే అవకాశం ఉంది. దీంతో ఆసిఫాబాద్, సిర్పూర్ ఎమ్మెల్యేలు పక్షం రోజులుగా తీవ్రస్థాయిలో కసరత్తు చేశారు. మిగతా రాజకీయ పార్టీలకు ఈ ఉప ఎన్నికలు ప్రీ ఫైనల్‌గా మారడంతో తమ సత్తా చాటుకోవాలని చూస్తున్నారు. ఆసిఫాబాద్ సెగ్మెంట్‌లోని సిర్పూర్(యు) మండలం నెట్నూర్ స్థానానికి అధికార పార్టీకి చెందిన అభ్యర్థి మాత్రమే నామినేషన్ దాఖలు చేయగా ఎన్నిక దాదాపుగా ఏకగ్రీవమైనట్లే. కౌటాల ఎంపీటీసీ స్థానాన్ని కైవసం చేసుకోవాలని కాంగ్రెస్, టీడీపీ, బీజేపీ, స్వతంత్ర అభ్యర్థులు ఎత్తుగడలు వేస్తున్నారు.

మేడ మీద మేటి ఎవుసం



» ప్రముఖ రచయిత అల్లం రాజయ్య ఆదర్శం

» నాలుగేళ్లుగా ఇంటిపై కూరగాయలు, పండ్ల సాగు

» పూర్తిగా సేంద్రియ ఎరువుల వాడకం

» ఇంటి అవసరాలు తీరడంతో పాటు మానసికోల్లాసం

మధ్య పేజీల్లో

తొట్టిలలో వంకాయ, కొత్తిమీర తదితర మొక్కలు

మంచిర్యాలలో ఫోరెన్సిక్ ల్యాబ్

6లో

ఇంటింటికీ మరుగుదొడ్డి నిర్మించుకోవాలి

» సమీక్షా సమావేశంలో డీఆర్‌డీవో వెంకట్

3లో



కాగజ్‌నగర్‌లో మాట్లాడుతున్న డీఆర్‌డీఓ వెంకట్



పశువులకు టీకాలు వేస్తున్న వైద్యుడు

గాలికుంటు నివారణకు టీకాలు

▸▸ జిల్లాలో కొనసాగుతున్న వైద్య శిబిరాలు

నెన్నెల, జనవరి 3: ప్రస్తుత పరిస్థితుల్లో పశువులకు గాలికుంటు వ్యాధి (ఫూట్ అండ్ మౌత్ డిసీజ్) సోకుతున్నది. దీంతో గేదెలు, ఆవులు పాలు సరిగ్గా ఇవ్వడం లేదు. పనులు చేసే ఎడ్లు నీరసించిపోతున్నాయి. ఫలితంగా రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఈ వ్యాధి కారణంగా గొర్రెలు, మేకలూ మృత్యువాతపడి గొల్లకుర్మలు ఆర్థికంగా దెబ్బతింటున్నారు. కాగా, ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటే ఈ వ్యాధిని అరికట్టవచ్చని పశువైద్యులు చెబుతున్నారు. ప్రస్తుతం ప్రభుత్వం తరపున ఉచితంగా టీకాలు వేస్తున్నారు. ఇందుకోసం మంచిర్యాల జిల్లావ్యాప్తంగా జనవరి1 నుంచి పశువైద్యశిబిరాలు ప్రారంభించారు. ఇవి ఈ నెల 13 వరకు కొనసాగుతాయనీ, రైతులు సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

గాలి కుంటు వ్యాధి లక్షణాలు..

చీలిక గిట్టెలున్న పశువులకు సంక్రమించే వ్యాధుల్లో గాలికుంటు వ్యాధి ఒకటి.

▸▸ ఆఫ్తో వైరస్ వల్ల ఈ వ్యాధి వ్యాప్తి చెందుతుంది. ఒక పశువు నుంచి మరో దానికి అతి తక్కువ కాలంలో సంక్రమిస్తుంది. ఈ వ్యాధితో మరణాల శాతం తక్కువే అయిన ప్పటికీ పశువుల్లో ఉత్పాదక సామర్థ్యం తగ్గి పోతుంది. గాలికుంటు వ్యాధి యుక్త వయసు ఉన్న పశువులు, బలహీనంగా ఉండి వ్యాధి నిరోధక శక్తి తక్కువగా ఉండే పశువుల్లో, దేశావాళీ పశువుల కంటే సంకర జాతి పశు వుల్లో ఎక్కువగా కనిపి స్తుంది.

▸▸ వ్యాధి సోకినప్పుడు పశువుల శరీర ఉష్ణోగ్రత 104 నుంచి 106 డిగ్రీల సెల్సియస్ ఉంటుంది.

▸▸ నోటి ఇఫిథీలియం, పళ్ల చిగుళ్లు నాలుక లోపలి ప్రాంతాల్లో బొబ్బలు ఏర్పడి అవి 24 గంటల్లో చితికి పోవడం వల్ల పశువులకు నొప్పి వస్తుంది. దీంతో పశువులు మేత ముట్టవు. నోటి నుంచి చొంగ కారుతుంది.

▸▸ గిట్టల మధ్య బొబ్బలు ఏర్పడి ఆ తర్వాత చితికి పోవడం వల్ల నొప్పితో పశువులు కుంటుతాయి.

▸▸ పొదుగుపై బొబ్బలు ఏర్పడి ఒక్కో సారి పొదుగుకు వాపు వస్తుంది.

▸▸ వ్యాధి సోకిన పశువు పాలను దూడలకు పడితే అవి చనిపోయే ప్రమాదముంది.. ఎడ్లు వ్యవసాయ పనులు చేయలేక నీరసించి పోతాయి. పాడి పశువుల్లో పాల దిగుబడి అకస్మాత్తుగా తగ్గిపోతుంది. చూడి పశువుల్లో గర్భస్రావాలు జరుగుతాయి.

▸▸ పశువుల్లో రక్తహీనత కనిపిస్తుంది.. శ్వాస కష్టంగా పీల్చుతూ, రొప్పుతూ, ఎండ వేడిమి తట్టుకోలేక నిరసిస్తాయి.

చికిత్స ఇలా..

▸▸ వ్యాధి సోకిన పశువులను మంద నుంచి వేరుచేసి సత్వరం చికిత్స చేయించాలి.

▸▸ పొటాషియం పర్మాంగనేట్ ద్రావణంతో పుండ్లను శుభ్రం చేయాలి. అనంతరం నోటి పుండ్లకు బోరోగ్లిజరిన్, కాలి పుండ్లకు జింక్ ఆక్సైడ్, లోరాక్సిన్, హిమాక్స్‌లాంటి అయింట్‌మెంట్లు పూయాలి. ఈగలు వాలకుండా వేప నూనె, నిమ్లింట్ లాంటి మందులను రాయాలి.

▸▸ 3 నుంచి 5 రోజుల పాటు అంటీబయాటిక్స్ మందులను వాడాల్సి ఉంటుంది.

వ్యాధి సోకకుండా..

▸▸ గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు మొదటి సారి 3 నెలల వయసులోనే వేయించాలి. ఆ తర్వాత ఏటా క్రమం తప్పకుండా టీకాలు వేయించాలి.

▸▸ ఆంబోతులు, దున్నల వీర్యం ద్వారా వ్యాధి వ్యాపిస్తుంది. అందువల్ల వ్యాధిసోకిన వాటిని సుమారు 3 నెలల పాటు సంపర్కానికి వినియోగించకూడదు.

▸▸ పాలుతాగే దూడలకు వ్యాధి సోకకుండా ఉండేదుకు దూడలు కలుషితమైన పాలు తాగకుండా జాగ్రత్త పడాలి. మనుషులు సైతం ఆ పాలను మరగకాచాకే వినియోగించాలి.

▸▸ పశువుల కొట్టాలను క్రిమి సంహారక మందులతో కాకుండా సోడియం హైడ్రాక్సైడ్, 2 శాతం ఫార్మబిన్, 4 శాతం సోడియం కార్బోనేట్ వంటి మందులతో శుభ్రం చేయడం వల్ల వైరస్ నశిస్తుంది.

పశువులకు టీకాలు తప్పకుండా వేయించాలి..



గాలికుంటు వ్యాధిని ముందు జాగ్రత్తతో నివారించవచ్చు. ఈ వ్యాధి సోకకుండా ఉండేందుకు పశు వులకు తప్పకుండా టీకాలు వేయించాలి. పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నాం. జిల్లాలో జనవరి 13 వరకు టీకాల కార్యక్ర మాలు కొనసాగుతుంది. మూడు నెలలు నిండిన పశువులన్నింటికీ తప్పనిసరిగా టీ కాలు వేయించాలి.

▸▸ **డాక్టర్ దిలీప్,**
పశువైద్యులు, నెన్నెల

యాసంగి వరికి 'జింకే' జీవం

జింకు లోపాన్ని నివారిస్తేనే అధిక దిగుబడులు

భైంసా జనవరి 3: పూర్వ ఆదిలాబాద్ జిల్లా పరిధిలోని పంట భూముల్లో జింకు లోపం ఎక్కువగా కనిపిస్తున్నది. రైతులు సేంద్రియ ఎరువులకు బదులు రసాయన ఎరువులను విచ్చలవిడిగా వాడుతున్నందున నానాటికీ భూములు నిస్సారంగా మారుతున్నాయి. ముఖ్యంగా జింక్, బోరాన్, మెగ్నీషియం లాంటి సూక్ష్మ పోషకాల లోపం ఏర్పడుతున్నది. అందులోనూ వరిలో జింకు లోపం వల్ల దిగుబడి తగ్గుతుంది. అందువల్ల రైతులు జింకులోటును పూడ్చుకోవాల్సిన అవసరముందని నిర్మల్ జిల్లా వ్యవసాయాధికారి అమరేష్ కుమార్ చెబుతున్నారు. ఇందుకోసం ఆయన అందిస్తున్న సూచనలు, సలహాలు యథాతథంగా..

▸▸ మురుగునీరు బయటకు వెళ్లే పరిస్థితి లేనప్పుడు, వాతావరణంలో ఉష్ణోగ్రతలు పడిపోయినప్పుడు జింకు లోపం బయటపడుతుంది.

▸▸ నేలలో జింక్ లోపం ఉంటే వేసిన ఎరువులు పనిచేయక వృథా అవుతాయి. పంట పెరుగుదల సరిగ్గా ఉండదు. దిగుబడులు తగ్గిపోతాయి. వరి పిలకలు తక్కువగా, ఆలస్యంగా వస్తాయి. లేత ఆకుల ఈనెల మధ్యభాగం పసుపు రంగులోకి మారిపోతుంది. పైరు కృషించి, గిడసబారి కనిపిస్తుంది.

▸▸ వరిలో జింకు లోపానికి ప్రధాన కారణం సేంద్రియ ఎరువులను వినియోగించకపోవడమే! అందువల్ల ప్రతి రైతూ వరి సాగుకు ముందు పెసర, అలసంద, జీలుగ లాంటి పచ్చిరొట్ట పైర్లను సాగుచేసి నేలలో కలియదున్నాలి.

▸▸ జింకు లోపం నివారణకు వర్మీకంపోస్టు, పశువుల పేడ, ఇతరత్రా సేంద్రియ ఎరువులను పంటలకు అందించాలి. వీలు కానప్పుడు వరి నాటే ముందు ఎకరాకు 20 కిలోల వంతున జింక్ సల్ఫేట్‌ను చల్లుకోవాలి.



జింక్ సల్ఫేట్ బస్తాలు

ఎట్టిపరిస్థితుల్లోనూ జింక్ సల్ఫేట్‌ను, భాస్వరపు ఎరువులతో కలిపి వేయరాదు. జింక్ సల్ఫేట్ వేయడానికి ముందు, తర్వాత రసాయన ఎరువులు వేసేందుకు కనీసం నాలుగురోజుల వ్యత్యాసం ఉండేలా చూసుకోవాలి.

▸▸ వరి నాటకముందు వేయలేకపోతే పైరు పై జింక్ సల్ఫేట్‌ను పిచికారీ చేయవచ్చు. నాటు పూర్తయిన 20 రోజులకు ఒకసారి, వారం వ్యవధిలో మరోసారి ఎకరానికి 400 గ్రాముల జింక్ సల్ఫేట్‌ను 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి. పదిహేను రోజుల వ్యవధిలో మరో దఫా పిచికారీ చేయాలి.

యాసంగి సాగులో రైతన్న బిజీ

మంచిర్యాల జిల్లాలో ఊపందుకున్న నాట్లు

దండేపల్లి, జనవరి 3: యాసంగి సాగులో రైతన్నలు బిజీగా మారిపోయారు. మంచిర్యాల జిల్లాలో బోర్లు, బావుల కింద వరినాట్లు ముమ్మరం చేశారు. వారం రోజులుగా ఎక్కడ చూసినా తెల్లారింది మొదలు చీకటి పడేదాకా పొలాల్లోనే దున్నుతూ, రొప్పుతూ, ఇతరత్రా పనులు చేస్తూ కనిపిస్తున్నారు. వరినాట్లతో వ్యవసాయ కూలీలకు చేతి నిండా పని దొరికింది. ఖరీఫ్‌లో వరికి దోమపోటు కారణంగా నష్టపోయిన అన్నదాతలు, యాసంగిలోనైనా గట్టెక్కుతామనే ఆశలో ఉన్నారు. దండేపల్లి మండలంలోని వివిధ గ్రామాల్లో పనుల్లో నిమగ్నమైన రైతుల దృశ్యమాలికే ఇది.



చింతపల్లి శివారులో ట్రాక్టర్‌తో పొలం సిద్ధం చేస్తున్న రైతు



తానిమడుగులో జంబు కొడుతున్న రైతు



రెబ్బనపల్లి శివారులో నాటు వేస్తున్న మహిళలు

ఇంటింటికి మరుగుదొడ్డి నిర్మించుకోవాలి : డీఆర్‌డీఓ

కాగజ్‌నగర్ రూరల్, జనవరి 3: ఇంటింటికి మరుగుదొడ్డి నిర్మించుకోవాలని డీఆర్‌డీఓ వెంకట్ సూచించారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో ప్రత్యేకాధికారులు, ఉపాధిహామీ సిబ్బంది, ప్రజాప్రతినిధులతో మరుగుదొడ్ల నిర్మాణంపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామస్థులు ఇంటింటా మరుగుదొడ్డి నిర్మించుకోవాలన్నారు. ఇందుకు గానూ సిబ్బంది ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించాలన్నారు. మరుగుదొడ్లు లేని కుటుంబాలను గుర్తించి నివేదిక తయారు చేయాలని సూచించారు. గ్రామాల వారిగా ఫీల్డ్ అసిస్టెంట్లు జనాభా ప్రాతిపదికన కుటుంబాలను గుర్తించి నిర్మాణాలు చేపట్టాలన్నారు. ఇది వరకే పలు మార్లు మరుగుదొడ్ల నిర్మాణాల విషయాలపై సమీక్షా సమావేశాలు నిర్వహించినప్పటికీ ఫలితం ఆశించిన స్థాయిలో రావడం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రతి ఒక్కరూ విధిగా ఆయా గ్రామాల్లో వంద శాతం మరుగుదొడ్ల నిర్మాణాలు జరిగేలా కృషి చేయాలని సూచించారు. మరుగుదొడ్ల నిర్మాణాల బిల్లుల విషయంలో లబ్ధిదారులను వేధించినా, నిర్లక్ష్యంగా వ్యవహరించిన సిబ్బందిపై శాఖపరమైన చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. 12వ తేదీ లోపు పూర్తి స్థాయిలో నిర్మాణం చేపట్టేలా లబ్ధిదారులకు సర్పంచ్‌లు, ఎంపీటీసీలతో సమావేశం నిర్వహించి అవగాహన కల్పించాలన్నారు. గతంలో ఆర్‌డబ్ల్యూఎస్ ద్వారా మరుగుదొడ్ల నిర్మాణాలు చేపట్టగా రూ.6 వేల బిల్లులు మంజూరు చేశారని, నిర్మాణాలు పూర్తైనప్పటికీ మరో రూ.6 వేలు ఇప్పటికీ చెల్లించలేదని కోసిని సర్పంచ్ శ్రీనివాస్ డీఆర్‌డీఓ దృష్టికి తీసుకువచ్చారు. దీంతో ప్రస్తుతం చేపడుతున్న బిల్లుల జాబితాలో వాటిని కూడా ఆన్‌లైన్‌లో పొందు పర్చి గతంలో నిర్మించుకున్న మరుగుదొడ్లకు బిల్లులు అందజేయనున్నట్లు ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జడ్పీటీసీ మౌల్కర్ లక్ష్మణ్, ఏపీడీ భావన రుషి, హెచ్‌బీఎస్ ప్రశాంత్‌కుమార్, హెచ్‌ఆర్‌డీఓ ఫణికుమార్, డీసీఎంలు అన్నాజీ, సారయ్య, ఏపీఓ బుచ్చయ్య, సర్పంచ్‌లు, ప్రత్యేకాధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


దహెగాంలో సమావేశానికి హాజరైన అధికారులు, ప్రజాప్రతినిధులు

దహెగాంలో...

దహెగాం : మండలంలో వందశాతం మరుగుదొడ్ల నిర్మాణం పూర్తి చేయాలని డీఆర్‌డీఓ వెంకట్ ఆదేశించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఈజీఎస్, ఐకేపీ, వీఓ అధ్యక్షురాళ్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బహిర్భూమికి బయటకు వెళ్లడం వల్ల కలిగే అనర్థాలను ప్రజలకు వివరించి మరుగుదొడ్ల నిర్మాణంపై అవగాహన కల్పించాలని అన్నారు. అన్ని కుటుంబాల వారు మరుగుదొడ్లు నిర్మించుకునే విధంగా అధికారులు ప్రజాప్రతినిధులు శ్రద్ధ వహించాలని కోరారు. మరుగుదొడ్లు నిర్మించుకున్న వారికి ప్రభుత్వం తరపున అందించే డబ్బులు సకాలంలో అందేలా చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. మండలంలో ఉపాధిహామీ పథకం కింద సీసీ రోడ్ల నిర్మాణం కోసం రూ.1.32 కోట్ల నిధులు మంజూరైనట్లు చెప్పారు. వీటి నిర్మాణం కోసం గ్రామ పంచాయతీల నుంచి తీర్మానాలు చేసి పంపించాలని సూచించారు. సమావేశంలో ఎంపీడీఓ కుటుంబరావు, మండల సమాఖ్య అధ్యక్షురాలు ప్రపూర్ణ, ఏపీడీ భావన రుషి, కో ఆర్డినేటర్ అన్నాజీ, స్వచ్ఛభారత్ అధికారి ప్రశాంత్, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

ఘనంగా సావిత్రీబాయి పూలే జయంతి

ఆసిఫాబాద్, జనవరి 3: జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద సావిత్రీబాయి పూలే జయంతి వేడుకలను అంబేడ్కర్ సెంట్రల్ కమిటీ ఆద్వర్యంలో వివిధ కుల సంఘాలు ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా కమిటీ జిల్లా అధ్యక్షుడు అశోక్ మహుల్కర్, ఎమ్మార్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు కేశవరావు, బీసీ సంఘం నాయకుడు పూలబోయిన మొండయ్య మాట్లాడారు. సావిత్రీబాయి పూలే జయంతిని అధికారికంగా సర్కారే నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఆలాగే స్వేరోస్ ఆధ్వర్యంలో సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలలో నిర్వహించిన వేడుకలకు డీఎస్పీ సత్యనారాయణ, దళిత సంక్షేమశాఖ జిల్లా ఆధికారి సునీత హాజరయ్యారు. దళిత సంక్షేమశాఖ జిల్లా ఆధికారి సునీత సావిత్రీబాయి పూలే సేవలను కొనియాడారు. ఆయా కార్యక్రమల్లో ఏపీఆర్వో తిరుమల, స్వేరోస్ రాష్ట్ర ఆధ్యక్షుడు కాంపెల్లి ఊశన్న, నార్త్‌జోన్ సంయుక్త కార్యదర్శి హేమంత్ షిండే, జిల్లా ఆధ్యక్ష, కార్యదర్శులు శ్యాంరావు, చైతన్య, ప్రిన్సిపాళ్లు సత్యనారయణ, గంగన్న, శ్రీనివాస్‌రెడ్డి, సంఘాల నాయకులు శ్యాంరావు దుర్గె నాయకులు మనోహర్ దుర్గె నికోడే రవిందర్, రజహైదర్, రజక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మల్లయ్య, బీఎస్పీ జిల్లా కార్యదర్శి పోచాం వైరాగడే, నాగ్‌రాజ్ ఆత్మరాం, రాహుల్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న దళిత సంక్షేమశాఖ జిల్లా ఆధికారి సునీత

ఆశ్రమ పాఠశాలను తనిఖీ చేసిన ఎస్సై

బెజ్జూరు, జనవరి 3: మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలికల గిరిజన ఆశ్రమోన్నత పాఠశాలను బుధవార ఎస్సై శివప్రసాద్ తనిఖీ చేశారు. ఆశ్రమ పాఠశాలలో విద్యార్థుల కోసం వండిన మధ్యాహ్న భోజనం మాడి పోవడంతో విద్యార్థులు తినలేదని తెలుసుకున్న ఎస్సై శివప్రసాద్‌తో పాటు గిరిజన నాయకులు భోజనాన్ని పరిశీలించారు. మరో సారి విద్యార్థులకు మాడిన అన్నం వడ్డించినట్లయితే ఊర్కోబోమని హెచ్చరించారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళుతామని తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై శివప్రసాద్ విద్యార్థులకు బిస్కెట్లు పంపిణీ చేశారు. ఆయన వెంట విద్యా కమిటీ చైర్మన్ పద్మ, ఎస్ఆర్పీ భిక్షమయ్య, నాయకులు సకారాం, తిరుపతి, పోతెపల్లి ఉప సర్పంచ్ పొన్నాజీరావు, జాహీద్ అలీ తదితరులు ఉన్నారు.


మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎస్సై శివప్రసాద్

బిట్స్

ఈసుగాం శివమల్లన్న ఆలయ హుండీ లెక్కింపు

కాగజ్‌నగర్ రూరల్, జనవరి 3: మండలంలోని ఈసుగాం శివమల్లన్న ఆలయంలో బుధవారం ఆదిలాబాద్ డివిజన్ దేవాదాయ శాఖ పరిశీలకులు ఎం.రాజమౌళి పర్యవేక్షణలో హుండీ లెక్కించారు. గత ఏడాది మార్చి నుంచి డిసెంబర్ వరకు హుండీ ఆదాయం రూ.1,69,776 వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి వేణుగోపాల్ గుప్తా తెలిపారు. గత ఏడాదితో పోల్చితే ఈ సారి హుండీ ద్వారా రూ.24 వేలు అధిక ఆదాయం వచ్చినట్లు చెప్పారు.కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ కుందారపు రాజేశ్వర్, కమిటీ సభ్యులు శివప్రసాద్, అమీత్ దాస్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలను సందర్శించిన రాష్ట్ర పరిశీలకుడు

బెజ్జూరు, జనవరి 3: బెజ్జూరు, పెంచికలపేట మండలాల్లోని ప్రభుత్వ పాఠశాలలను బుధవారం రాష్ట్ర పరిశీలకుడు రమేశ్ పరిశీలించారు. బెజ్జూరు మండలంలోని పాపనపేట, పెంచికలపేట మండలంలోని చెడ్వాయి జిల్లా పరిషత్ పాఠశాలను పరిశీలించి విద్యార్థుల చదువుపై ఆరా తీశారు. సమగ్ర మూల్యాంకనం అందుతున్న తీరును అడిగి తెలుసుకుని ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. ఆయన వెంట ఎంఈఓ రమేశ్ బాబు,ప్రధానోపాధ్యాయుడు కృష్ణంరాజు ఉన్నారు.

మూడు నామినేషన్ల తిరస్కరణ

కౌటాల, జనవరి 3: ఈ నెల 11న నిర్వహించనున్న ఎంపీటీసీ స్థానానికి వచ్చిన 16 నామినేషన్లలో మూడు తిరస్కరించినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి సీతారాంనాయక్, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు యాక య్య, తోటాజీ తెలిపారు. మొత్తం 10 మంది అభ్యర్థులు 16 నామినేషన్లు దాఖలు చేశారని చెప్పారు. స్వతంత్ర అభ్యర్థి లోడెల్లి పుష్పలత, కాంగ్రెస్ అభ్యర్థి డోబె స్వప్న, స్వతంత్ర అభ్యర్థి శంకరబాయి నామినేషన్ పత్రాలు సరిగ్గా నింపకపోవడంతో తిరస్కరణకు గురైనట్లు తెలిపారు.

కాగజ్‌నగర్

విద్యార్థులు సమాజ సేవ చేయాలి

కౌటాల, జనవరి 3: విద్యార్థులు ఇప్పటి నుంచే సమాజ సేవలో పాల్గొనాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కృష్ణ పిలుపునిచ్చారు. మండలంలోని తలోడి, నాగెపల్లి గ్రామాల్లో ఎన్ఎస్ఎస్ శిబిరం ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. కళాశాల ప్రారంభమైన నాటి నుంచి కౌటాల జూనియర్ కళాశాల విద్యార్థులు ఎన్ఎస్ఎస్ శిబిరాల్లో భాగంగా వివిధ గ్రామాల్లో రోడ్లు, మురికి కాలువలు శుభ్రం చేస్తూ స్వచ్ఛభారత్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ శ్రీనివాస్‌గౌడ్, నాయకులు ఆగయ్య, ఉపసర్పంచ్ శ్రీనివాస్, సంతోష్, అధ్యాపకులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

క్రీడల్లో సత్తా చాటాలి

పాల్వాయి హరీష్‌బాబు

బెజ్జూరు, జనవరి 3: గ్రామీణ ప్రాంతాల్లోని యువత క్రీడల్లో సత్తా చాటాలని డాక్టర్ పాల్వాయి హరీష్ బాబు అన్నారు. మండలంలోని సులుగుపల్లి గ్రామంలో పాల్వాయి పురుషోత్తమరావు స్మారక క్రికెట్ పోటీలను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు మానసికోల్లాసంతో పాటు శారీరక ధృడత్వాన్ని కలిగిస్తాయని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పాల్వాయి రాజ్యలక్ష్మి, మాజీ జడ్పీటీసీ పాల్వాయి సుధాకర్‌రావు, సర్పంచ్ విశ్వేశ్వర్, మాజీ సర్పంచ్ లింగయ్య, నాయకులు చిలువేరు శ్యాం, రామయ్య పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు వినతి

కౌటాల, జనవరి 3: పార్లమెంట్‌లో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశ పెట్టాలని ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో బుధవారం తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. ఎమ్మార్పీఎస్ నాయకులు పిట్టల సత్యనారాయణ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ కోసం మందకృష్ణ మాదిగ చేసిన ఉద్యమం ఉధృతమైందని తెలిపారు. ఎస్సీ వర్గీకరణ చేపట్టకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో విఠల్, రాజుబాయి, సాయికుమార్, ఇస్తారి, రమేష్, బానయ్య, రవిశంకర్, లస్మయ్య, శంకర్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

యువకుడి మృతికి ప్రభుత్వమే బాధ్యత వహించాలి

సిర్పూర్(టి), జనవరి 3: మహారాష్ట్రలోని పూణెలో మంగళవారం జరిపిన కాల్పుల్లో చనిపోయిన దళిత యువకుడి మృతికి కేంద్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలని జాతీయ బౌద్ధ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రాంటెంకి శ్రీహరి డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన జక్కాపూర్ గ్రామంలో దళితులతో కలిసి మౌనం పాటించారు. దీన్ని ప్రభుత్వ హత్యగా పరిగణించాలని, సంఘటనలపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరపించాలని డిమాండ్ చేశారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

బెజ్జూరు, జనవరి 3: పెంచికలపేట మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో ఎమ్మెల్యే కోనేరు కోనప్ప టీయూటీఎఫ్ క్యాలెండర్లను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. టీయూటీఎఫ్ జిల్లా సహ అధ్యక్షుడు భానుప్రకాష్, మండలాధ్యక్షుడు అశోక్, ప్రధానోపాధ్యాయురాలు పద్మజ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

కౌటాల, జనవరి 3: మండల కేంద్రంలో ఎస్సై అశోక్ ఆధ్వర్యంలో సోమవారం వాహనాల తనిఖీ నిర్వహించారు. మద్యం సేవించి వాహనాలు నడపవద్దని సూచించారు. డ్రైవింగ్ లైసెన్సులు, వా హనపత్రాలు సరిగా లేని పలువురికి జరిమానా విధించారు.

సావిత్రీబాయిని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలి

కౌటాల, జనవరి 3: దేశంలోనే మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలైన సావిత్రీబాయిని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని సిర్పూర్ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప అన్నారు. మండలంలో సావిత్రీబాయి పూలే జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద ఉన్న జ్యోతిభా పూలే విగ్రహం వద్ద సావిత్రీబాయి చిత్రపటానికి ఎమ్మెల్యే కోనప్ప పూలమాల వేశారు. ఆయన మాట్లాడుతూ బాల్య వివాహాలు అరికట్టడానికి సావిత్రీబాయి ఎంతో కృషి చేశారని కొనియాడారు. కార్యక్రమంలోఎంపీపీ దుబ్బుల వెంకన్న, జడ్పీటీసీ నానయ్య, ఆర్ఎస్ఎస్ కన్వీనర్ విశ్వనాథ్, ఐటీడీఏ పాలకవర్గం సభ్యుడు మాంతయ్య, నహీం అహ్మద్, శ్రీనివాస్‌గౌడ్, ఆనంద్‌రావు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సావిత్రీబాయి పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే పాల్వాయి రాజ్యలక్ష్మి, ఆమె తనయుడు పాల్వాయి హరీష్‌రావు సావిత్రీబాయి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కౌటాల మాలి సంఘం ఆధ్వర్యంలో సావిత్రీబాయి జయంతిని నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో కాంగ్రెస్ అధికార ప్రతినిధి గోసుల శ్రీనివాస్ యాదవ్, మాజీ జడ్పీ చైర్మన్ సిడాం గణపతి, నియోజకవర్గ నాయకుడు రావి శ్రీనివాస్, దస్తగిరి, మండల అధ్యక్షుడు యశ్వంత్, భాస్కర్‌రాజు, నాహీర్, సమీర్, మల్లయ్య, సోహెల్, తుకారాం, పెద్దపల్లి భీమన్న, విఠల్, మాజీ ఎంపీపీ నికోడే గంగారాం, సెండె ఇస్తారి, నాందేవ్, ఆదె వసంత్‌రావు, పాల్గొన్నారు.


కాగజ్‌నగర్‌లో సావిత్రీబాయి చిత్రపటానికి పూలమాల వేస్తున్న అధ్యాపకులు

కాగజ్‌నగర్: పట్టణంలో సావిత్రీబాయిపూలే జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక బాలభారతి కళాశాలలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు సావిత్రీబాయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పలువురు అధ్యాపకులు మాట్లాడుతూ బాలికల కోసం ప్రత్యేక పాఠశాలలను ప్రారంభించిన ఘనత సావిత్రీబాయి పూలేకే దక్కిందన్నారు. దళితులకు, వెనుకబడిన వర్గాల వారిని సంస్కరించిన మహనీయురాలు సావిత్రీబాయి అని కొనియాడారు. ప్రతి ఒక్కరూ ఆమె ఆశయాలను కొనసాగించాలని పిలుపునిచ్చారు. పట్టణంలోని పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ మెమోరియల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సావిత్రీబాయి జయంతిని నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో బాలభారతి కళాశాల ప్రిన్సిపాల్ శ్రీమన్నారాయణ, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కనకదుర్గ, రాధా, వేణు, వినోద్, రజిత, ఉపాధ్యాయులు, అధ్యాపకులు, డాక్టర్ అంబేద్కర్ మెమోరియల్ అసోసియేషన్ అధ్యక్షుడు రాంటెంకి లక్ష్మన్, ముంజం శేఖర్, లహను, డోంగ్ర వంసత్, తుకారం పాల్గొన్నారు.


కౌటాలలో సావిత్రీబాయి చిత్రపటానికి పూలమాల వేస్తున్న నాయకులు

పదిలో ఉత్తమ ఫలితాలు సాధించాలి

డీటీడీవో కృష్ణా నాయక్

కాగజ్‌నగర్ టౌన్: ప్రభుత్వ ఆశ్రమోన్నత పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించాలని డీటీడీఓ కృష్ణా నాయక్ అన్నారు. బుధవారం స్థానిక ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు బోదన మూల్యంకనం, భోజనవసతి తదితర అంశాలపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఉపాధ్యాయులతో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. పదిలో వందశాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. అందుకు విద్యార్థులకు ఎప్పటికప్పుడు స్లిప్‌టెస్టులు నిర్వహించాలన్నారు. దీనిద్వారా విద్యార్థుల స్థాయి నిర్ధారణ అవుతుందని తెలిపారు. సిలబస్ పూర్తి చేసి, ఉదయం, సాయంత్రం వేళల్లో అదనపు తరగతులు నిర్వహించాలని సూచించారు. డిజిటల్ తరగతుల బోధనను ఆయన పరిశీలించారు. ఆయన వెంట ఏటీడీఓ శ్రీనివాస్ రెడ్డి, ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయుడు సుధాకర్, వార్డెన్ వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు ప్రసాద్, శ్రీనివాస్, నాందేవ్, తదితరులు ఉన్నారు.


డిజిటల్ తరగతులను పరిశీలిస్తున్న డీటీడీవో

12 నుంచి 'భీం' స్మారక క్రీడలు

బెజ్జూరు, జనవరి 3: మండలంలోని కుంటలమానెపల్లిలో ఈనెల 12 నుంచి కుమరం భీం స్మారక కబడ్డీ, వాలీబాల్ క్రీడలను నిర్వహిస్తున్నట్లు స్ఫూర్తి యూత్ అధ్యక్షుడు కోర్తె తిరుపతి తెలిపారు. ఆసక్తి గల యువకులు క్రీడల్లో పాల్గొనాలని ఆయన కోరారు.

'ఎస్పీఎం కార్మికులకు అన్యాయం చేస్తున్న ప్రభుత్వం'

కాగజ్‌నగర్: మిల్లు పునరుద్ధరణ విషయంలో ఎస్పీఎం కార్మికులకు రాష్ట్రప్రభుత్వం అన్యాయం చేస్తోందని పీసీసీ అధికార ప్రతినిధి గోసుల శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. మంగళవారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్‌సీఎల్‌టీ కోర్టులో కేసు వేసిన తర్వాత కార్మికులకు రావాల్సిన బకాయిల కోసం దరఖాస్తులు చేస్తే చాలా కష్టమైన పరిస్థితులు ఎదురవుతారన్నారు. సెటిల్‌మెంట్లు చేసిన తర్వాత కార్మికులకు మిల్లుతో ఎలాంటి సంబంధాలు ఉండవని తెలిపారు. ఈ విషయంలో పెద్ద కుట్ర జరుగుతుందని ఆరోపించారు. మిల్లు మూతపడి మూడేళ్లయినా పునరుద్ధరణ చర్యలు తీసుకోవడంలో జాప్యం ఎందుకు జరుగుతోందని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. కార్మికులకు న్యాయం జరిగే వరకు కాంగ్రెస్ పార్టీ పక్షాన పోరాడతామని తెలిపారు. సమావేశంలో దుర్గం యశ్వంత్‌రావు, మహ్మద్ అలీ, నయిం బేగ్, సిదం శ్రీనివాస్ పాల్గొన్నారు.

కొండయ్య మహారాజ్ జాతర పోస్టర్ల విడుదల

కౌటాల, జనవరి 3: మహారాష్ట్రలోని చంద్రాపూర్ జిల్లా దాబా గ్రామంలో నిర్వహించే కొండయ్య మహారాజ్ జాతర పోస్టర్లను ఎమ్మెల్యే కోనేరు కోనప్ప ఆధ్వర్యంలో ఆలయ కమిటీ సభ్యులు బుధవారం విడుదల చేశారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్ష, ఉపాధ్యక్షులు అమర్, బాబురావు, కార్యదర్శి కిశోర్, కోశాధికారి స్వప్నిల్, సభ్యులు రాజు, పతియార్, కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్వ్యూ



దొంగతనాలను అరికట్టడానికి ప్రత్యేక చర్యలు

- మోహన్, సీఐ, కౌటాల

ఆంధ్రజ్యోతి: శాంతిభద్రతల పరిరక్షణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

సీఐ: శాంతిభద్రతల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నాం. ఇందుకోసం ప్రణాళికలు రూపొందిస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: గుడుంబా, గుట్కా అమ్మకాలను నియంత్రిస్తున్నారా?

సీఐ: ఇప్పటికే మండలాన్ని గుడుంబా రహితంగా తీర్చిదిద్దాం. గుట్కాపై కూడా ప్రత్యేక దృష్టి సారించాం.

ఆంధ్రజ్యోతి: దొంగతనాలను అరికట్టేందుకు ఎలాంటి చర్యలు చేపడుతున్నారు?

సీఐ: దొంగతనాలను నియంత్రించడానికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నాం. ముఖ్యంగా వ్యాపార సముదాయాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని వ్యాపారులకు అవగాహన కల్పిస్తున్నాం. రాత్రి వేళల్లో గస్తీ నిర్వహిస్తున్నాం.

- కౌటాల

ప్రజా సంక్షేమం కోసమే రాజకీయ ప్రవేశం

మాజీ ఎమ్మెల్యే పాల్వాయి రాజ్యలక్ష్మి

కౌటాల, జనవరి 3: ప్రజా సంక్షేమం కోసమే పాల్వాయి హరీష్‌బాబు రాజకీయ ప్రవేశం చేశారని మాజీ ఎమ్మెల్యే పాల్వాయి రాజ్యలక్ష్మి స్పష్టం చేశారు. మండల కేంద్రంలోని ప్రజా కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రస్తుతం ప్రజలకు ప్రభుత్వ ఫలాలు అందక అన్యాయం జరుగుతుందన్నారు. ప్రాణహిత, పెద్దవాగులో భూములు కోల్పోయిన రైతులు నష్టపోయారని తెలిపారు. ప్రజలకు సేవ చేసేందుకు త్వరలో వైద్యశాల నిర్మిస్తామని చెప్పారు. అనంతరం పాల్వాయి హరీష్‌బాబు మాట్లాడుతూ నీతి, అర్థవంతమైన పాలనను ప్రజలు కోరుకుంటున్నారని తెలిపారు. బంగారు తెలంగాణ సాధించాలంటే బంగారం లాంటి మనుషులు అవసరమని, వెండి, ఇత్తడి లాంటి మనుషులు అవసరం లేదని చెప్పారు. ప్రస్తుతం జరుగబోయే ఎంపీటీసీ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థి పుష్పలతను గెలిపించి నియోజకవర్గ విమోచనానికి నాంది పలుకాలని కోరారు. తమకు ఆలోచనకు దగ్గరగా ఉన్న వ్యక్తి పుష్పలతను గెలిపించాలని కోరారు. సమావేశంలో మాజీ మున్సిపల్ చైర్మన్ చెప్యాల నర్సింగ్‌రావు, ఎల్ములె మల్లయ్య, చిలువేరు శ్యాం, సోహెల్, తుకారాం, విఠల్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే పాల్వాయి రాజ్యలక్ష్మి

ఘనంగా అయ్యప్ప పడిపూజ

ఆసిఫాబాద్‌రూరల్, జనవరి 3: ఆసిఫాబాద్ గాంధీచౌక్ సమీపంలో గల గాయత్రి వాటర్‌ప్లాంట్‌లో మంగళవారం రాత్రి ముదిగొండ రాజశేఖరశర్మ, శ్రీధర్‌శర్మ ఆధ్వర్యంలో పడిపూజ చేశారు. కరీంనగర్ జిల్లా సుల్తానాబాద్‌కు చెందిన కళాకారుడు రాంచందర్ పాటలు ఆలపించాయి. పదునెట్టంబడిపై దీపాలు వెలిగించారు. కార్యక్రమంలో పలువురు భక్తులు పాల్గొన్నారు.



పూజలు చేస్తున్న భక్తులు

సావిత్రీబాయి ఆశయ సాధనకు పాటుపడాలి

» మాలీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వాడై నారాయణ



ఇందానిలో జెండా ఆవిష్కరిస్తున్న సావిత్రీబాయి పూలే సంఘం అధ్యక్షురాలు కమలాబాయి

వాంకిడి, జనవరి 3: దేశంలోనే విద్యావంతురాలైన తొలి మహిళ సావిత్రీబాయి పూలే అని, ఆమె ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని మాలీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వాడై నారాయణ పిలుపునిచ్చారు. బుధవారం మండల కేంద్రంలోని నిర్వహించిన క్రాంతి జ్యోతి సావిత్రీబాయి పూలే జయంతి వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరైనారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1848లో పుణెలో మహాత్మాజ్యోతిబాపూలే సొంత ఖర్చుతో పాఠశాలను ఏర్పాటు చేసి విద్యావంతురాలైన తన సతీమణి అయిన సావిత్రీబాయి పూలేను ఉపాధ్యాయురాలుగా నియమించారని చెప్పారు. అలాగే మండలంలోని కోమటిగుడ, వాంకిడి, ఇందాని, ఖిరిడి తదితర గ్రామాల్లో పూలే జయంతిని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆయా కార్యక్రమాల్లో మాలీ సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు గుర్నులే నారాయణ, కార్యదర్శి బెండారే కృష్ణ, నాయకులు సెండె హనమంతు, ఆదేబాబురావు, ఇందాని గ్రామపటేల్ వడ్గూరే లక్ష్మణ్, సావిత్రీబాయి కమిటీ అధ్యక్షురాలు నాగోసే కమలాబాయి, మారుతి, డా. పోచాలు పాల్గొన్నారు.

లింగాపూర్‌లో...

లింగాపూర్ : సావిత్రీబాయి పూలే అడుగుజాడల్లో నడవాలని రమాబాయి మహిళా సంఘం నాయకులు కేవుడబాయి, దుర్గతబాయి పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని అంబేద్కర్ భవన్‌లో బుధవారం సావిత్రీబాయి పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భారతిబాయి, ఆనందబాయి, సత్యశీలబాయి, సుమన్‌బాయి, జయశీల, వందన, సుజాత, ప్రమీల, రూపమాల, కస్తూర్బాబాయి తదితరులు పాల్గొన్నారు.

రెబ్బెనలో...

రెబ్బెన, మండలంలో సావిత్రీబాయి పూలే జయంతి వేడుకలను మాలి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. గంగాపూర్, పుంజుమేరగూడ, పాసిగాం, సింగిల్‌గూడ, నవేగాం, కొండపల్లి, మద్దికుంట తదితర గ్రామాల్లో మాలి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మాలి సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు గంటు మేర, మండలాధ్యక్షుడు బాబురావు, శ్రీనివాస్, శంకర్, గొండయ్య, హన్మంతు, లోకాజీ, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

కెరమెరిలో...

కెరమెరి : మండల కేంద్రంలో పంచాయతీ కార్యాలయంతో పాటు స్థానిక హైస్కూల్, కైరి గ్రామాల్లో సావిత్రీబాయి పూలే జయంతిని ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమంలో కెరమెరి ఎంపీపీ గణేష్, ఈఓపీఆర్‌డీ బుర్ర పోచయ్య, ఏపీఎం జగదీష్‌తో పాటు ఈజీఎస్ ఏపీఓ నగేష్ తదితరులు పాల్గొన్నారు.

జైనూర్‌లో...

జైనూర్ : మండల కేంద్రంలో సావిత్రీబాయి పూలే జయంతిని జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఎస్సై శ్రీనివాస్, టీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు ఇంతియాజ్ లాలా తదితరులు సావిత్రీబాయి చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు మెస్రం లక్ష్మణ్, భీంరావు, గోవింద్ రావు, దయానంద్, జనార్దన్ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

8 నుంచి వట్టివాగు నీరు విడుదల

ఆసిఫాబాద్‌రూరల్, జనవరి 3: వట్టివాగు ప్రాజెక్టు ఆయకట్టు రైతులకు రబీ సాగుకు 8వ తేది నుంచి నీటిని విడుదల చేస్తామని ఈఈ బద్రీ నారయణ, డీఈ సలీం, ఏఈ జానీ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రాజెక్టు ఎడమ కాలువ కింద పూర్తి ఆయకట్టుకు, కుడి కాలువ కింద డీ5 వరకు నీటిని విడుదల చేయనున్నామని వారు పేర్కొన్నారు. ప్రధాన కాలువలు, బ్రాంచి కాలువలు, పిల్ల కాలువల పరిస్థితి సరిగ్గా లేనందున రైతులు నీటిని సక్రమంగా వినియోగించుకోవాలని వారు సూచించారు. వ్యవసాయాధికారుల సలహాలు, సూచనలు ఎప్పటికప్పుడు తీసుకోవాలని కోరారు. నీటి విడుదల మే 7 వరకు కొనసాగుతుందని తెలిపారు రెవెన్యూ అధికారులు ఏప్రిల్ 1 నుంచి మే 7 వరకు నీటిపారుదల శాఖ అధికారులతో కలిసి జాయింట్ అజమాయిషి పూర్తి చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

'జిల్లాలో పద్మశాలి సంఘం బలోపేతానికి కృషి'



ప్రమాణ స్వీకారం చేస్తున్న సభ్యులు

ఆసిఫాబాద్, జనవరి 3: పద్మశాలి సంఘం బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అఖిల భారత పద్మశాలి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బాబురావు పిలుపునిచ్చారు. బుధవారం జిల్లా కేంద్రంలో జన్కపూర్ పద్మశాలి భవనంలో ఏర్పాటు చేసిన జిల్లా నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు చెన్నూరి అశోక్, ప్రధాన కార్యదర్శి బండి శ్రీనివాస్, రాష్ట్ర నాయకుడు బాపూజీ, గాజర్ల వెంకటేశం, శంకర్, కనకయ్య, ఉమ్మడి జిల్లా మహిళా విభాగం మాజీ అధ్యక్షురాలు మంగమ్మ, నాయకులు లింగయ్య, శ్రీకాంత్, ధర్మయ్య, శేఖర్, సదానందం తదితరులు పాల్గొన్నారు.

నాట్యంలో విద్యార్థిని ప్రతిభ

ఆసిఫాబాద్, జనవరి 3: స్థానిక సెయింట్ మేరి ఉన్నత పాఠశాలకు చెందిన 4వ తరగతి విద్యార్థిని ఆర్. ప్రజ్ఞ నాట్యంలో ప్రతిభ చూపి అవార్డులు సొంతం చేసుకున్నట్లు ప్రిన్సిపాల్ బీనా మేరి తెలిపారు. హైదరాబాద్‌లో డిసెంబరు 30న నిర్వహించిన నటరాజ పాద నృత్యార్చనోత్సవంలో ప్రతిభ చూపిందని చెప్పారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్‌తో పాటు ఉపాధ్యాయులు ప్రజ్ఞను అభినందించారు.

బాధ్యతల స్వీకరణ

ఆసిఫాబాద్, జనవరి 3: కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లా డీసీఆర్బీ సీఐగా రాంబాబు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. రాంబాబు గతంలో ఆసిఫాబాద్, మాదారం, వరంగల్ సుబేదారి ఎస్సైగా పని చేశారు. ప్రభుత్వం ఇటీవల ఎస్సైలకు సీఐలుగా పదోన్నతి కల్పించి బదిలీ చేయడంతో ఆయన ఆసిఫాబాద్ డీసీఆర్బీ సీఐగా నియమితులు కావడంతో ఈ మేరకు బాధ్యతలు స్వీకరించారు.

ఎస్పీని కలిసిన ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే

ఆసిఫాబాద్‌రూరల్, జనవరి 3: కుమరం భీం జిల్లా ఆసిఫాబాద్ జిల్లా ఎస్పీ కల్మేశ్వర్ సింగెనవార్‌ను బుధవారం ఎమ్మెల్సీ పురాణం సతీష్, ఎమ్మెల్యే కోవ లక్ష్మి క్యాంపు కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

6న గంగాపూర్ జాతర వేలం

రెబ్బెన, జనవరి 3: మండలంలోని గంగాపూర్‌లో శ్రీ బాలాజీ వేంకటేశ్వర స్వామి ఆలయ సన్నిధిలో 31వ తేదీన నిర్వహించనున్న గంగాపూర్‌జాతర సందర్భంగా ప్రసాదం, కొబ్బరికాయల అమ్మకాలు, సైకిల్ స్టాండ్ నిర్వహణ హక్కు పొందేందుకు శనివారం వేలం పాట నిర్వహించనున్నామని ఈఓ బాపిరెడ్డి తెలిపారు. ఆసక్తి గల వ్యాపారులు వేలంలో పాల్గొనాలని కోరారు.

ప్రధానోపాధ్యాయుల సమావేశం

కెరమెరి, జనవరి 3 : ఎమ్మార్సీలో బుధవారం ప్రధానోపాధ్యాయులకు ఎంఈఓ సమావేశం నిర్వహించారు. మధ్యాహ్న భోజన రిపోర్టులు వెంటనే అందజేయాలన్నారు.సమావేశంలో ప్రధానోపాధ్యాయులు సత్యనారాయణ, రమేశ్ బాబు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతుల అందజేత

ఆసిఫాబాద్‌రూరల్, జనవరి 3: వర్తమాన డిజిటల్ మార్కెటింగ్‌లో సమస్యలు, సవాళ్లు అనే అంశంపై నిర్వహించిన ఉపన్యాస, వ్యాసరచన పోటీల్లో విజేతలకు బుధవారం జాయింట్ కలెక్టర్ అశోక్ కుమార్ బహుమతులు అందజేశారు. ప్రథమ బహుమతి కె. నవ్య, ద్వితీయ ఈ. రాజేశ్వరి, తృతీయ జి. శ్రీలతలు పొందారు. ప్రథమ బహుమతికి రూ. 3వేలు, ద్వితీయకు రూ. 2వేలు, తృతీయకు రూ. 1500 అందజేశారు. కార్యక్రమం లో జిల్లా పౌరసరఫరాల అధికారి సత్యనారాయణ, ప్రభుత్వ పార్క్ పుస్తకాల మేనేజర్ ధర్మపురి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పదోతరగతి విద్యార్థులపై దృష్టి సారించండి

తిర్యాణి, జనవరి 3: పదోతరగతి విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని జీసీడీఓ శకుంతల అన్నారు. బుధవారం తిర్యాణి మండలంలోని గిన్నెదరి ఆశ్రమ ఉన్నత పాఠశాలను ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వెనుక బడ్డ విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ కనబరుచాలన్నారు. క్రమం తప్పకుండా స్లిప్ టెస్ట్‌లను నిర్వహించాలని ఆదేశించారు. ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తూ వందశాతం ఫలితాల సాధనకు పాటుపడాలని ఆమె పిలుపునిచ్చారు. ఆమె వెంట ప్రధానోపాధ్యాయురాలు ఈశ్వరి ఉన్నారు.

'దళితులపై దాడిచేసిన దుండగులను శిక్షించాలి'



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న అంబేద్కర్ యువజన సంఘం నాయకులు

వాంకిడి, జనవరి 3: మహారాష్ట్రలోని భీమా- కోరెగావ్‌లో దళితులపై దాడి చేసిన దుండగులను శిక్షించాలని బుధవారం అంబేద్కర్ యువజన సంఘం నాయకులు తహసీల్దార్ మల్లికార్జున్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భీమా- కోరెగావ్‌లో నిర్వహించిన విజయ్ దివస్‌కు హాజరైన దళితులపై అగ్రవర్ణాలవారు దాడిచేయడం హేయమైన చర్య అన్నారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని వారు కోరారు. కార్యక్రమంలో నాయకులు దుర్గం సందీప్, మనోర్‌కార్ రాజు, ఉప్రె జైరాం, రాంటెంకి భీంరావు, పెరుగు తుకుడు, దుర్గం మనోజ్‌కుమార్, పెరుగు అరవింద్, రోషన్ తదితరులు పాల్గొన్నారు.

ఆసిఫాబాద్‌లో...

ఆసిఫాబాద్ : భీమా- కోరెగావ్ బాధితులకు న్యాయం చేయాలని టీమాస్ ఫోరం జిల్లా చైర్మన్ పెద్దపల్లి కిషన్‌రావు కోరారు. బుధవారం ఆసిఫాబాద్ పట్టణంలోని షైన్మార్ట్ ఫంక్షన్ హాల్‌లో జిల్లా కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. భీమా- కోరెగావ్‌లో దళితులు విజయస్తూపానికి నివాళులు అర్పించేందుకు వెళ్తుండగా వారిపై దాడి చేసి కార్లు ధ్వంసం చేసిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో టీమాస్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు సిడాం అర్జు, జిల్లా స్టీరింగ్ కమిటీ సభ్యుడు నికోడే రవీందర్, రేగుంట కేశవరావు, కార్తీక్, దినకర్, ఇస్తాంభీన్, కూశన రాజన్న, కోట శ్రీనివాస్, వసంత్, రాకేష్, రాజేష్, ముంజం ఆనంద్, అల్లి రాజయ్య, బావండ్లపల్లి నర్సయ్య, అనిల్, సిడాం అన్నిగ తదితరులు పాల్గొన్నారు.

లింగాపూర్‌లో...

లింగాపూర్ : భీమా- కోరెగావ్‌లో విధ్వంసానికి పాల్పడిన వ్యక్తులతో పాటు దళిత వ్యక్తికి మృతికి కారకులైన వారిని శిక్షించాలని అంబేద్కర్ సంఘం మండల గౌరవ అధ్యక్షుడు నగరే శంకర్ డిమాండ్ చేశారు. బుధవారం విలేకరుల సమావేశంలో మాటాడారు. కార్యక్రమంలో నాయకులు పుడలిక్, గౌతం, దయనంద్, అభిషేక్, వసంత్ తదితరులు ఉన్నారు.

[redacted] బిట్స్..

జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారిగా కుమారస్వామి

ఆసిఫాబాద్‌రూరల్, జనవరి 3: జిల్లా పశుసంవర్ధక శాఖ ఆధికారిగా డాక్టర్ కుమారస్వామి బుధవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. మంచిర్యాలలో పనిచేస్తున్న కుమార స్వామిని ఆసిఫాబాద్‌కు బదిలీ చేశారు. గతంలో ఇక్కడ పనిచేసిన డాక్టర్ సురేష్‌కు పదోన్నతి కల్పిస్తూ ఆదిలాబాద్ డిప్యూటీ డైరెక్టర్‌గా బదిలీ చేసింది.



డాక్టర్ కుమారస్వామి

పెద్దవాగుపై వంతెన నిర్మాణంతో రవాణా మెరుగు

» ఎమ్మెల్యే కోనేరు కోనప్ప



వంతెన నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే కోనేరు కోనప్ప

బెజ్జూరు, జనవరి 3: పెంచికలపేట-దహెగాం మండలాల మధ్య ప్రవహిస్తున్న పెద్దవాగుపై వంతెన నిర్మాణంతో వివిధ మండలాలకు రవాణా వ్యవస్థ మెరుగు పడుతుందని సిర్పూర్ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప అన్నారు. బుధవారం పెద్దవాగుపై వంతెన నిర్మాణ పనులను ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ఇటీవల వంతెన నిర్మాణం కోసం ప్రభుత్వం రూ.29 కోట్లు మంజూరుచేసిందని రానున్న ఏడాదిలోగా వంతెన నిర్మాణం పూర్తి చేసి రవాణా సౌకర్యం మెరుగుపరుస్తామన్నారు. గత ఏడాది పెంచికలపేటను మండల కేంద్రంగా ఏర్పాటు చేయడంతో పాటు వంతెన నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరుచేసిందన్నారు. ఇప్పటికే పెంచికలపేట నుంచి కాగజ్‌నగర్ వరకు డబుల్ రడ్డు నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని వచ్చే ఏడాదికల్లా పెంచికలపేట నుంచి బెజ్జూరు వరకు డబుల్ రోడ్డు వరకు నిధుల మంజూరుకు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీలు సత్యనారాయణ, సాజీద్, సర్పంచ్ రాజేష్, రైతు సమన్వయ సమితి జిల్లా సభ్యుడు జగ్గాగౌడ్, నాయకులు సదాశివ్, తిరుపతి, శ్రీనివాస్, రాంచందర్, బి.శ్రీనివాస్, ఆర్.రాజు, పి.రామన్న, ఆర్.కృష్ణ, డి.రాజం తదితరులు పాల్గొన్నారు.

5న లూయిస్ బ్రెయిలి జయంతి వేడుకలు

ఆసిఫాబాద్‌రూరల్, జనవరి 3: అంధుల ఆశాజ్యోతి లూయిస్ బ్రెయిలి 209వ జయంతి వేడుకలను ఈనెల 5న జిల్లా సంక్షేమాధికారి కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు మహిళలు, పిల్లల, దివ్యాంగులు, వయోవృద్ధుల శాఖ అధికారిణి కె. సావిత్రి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అంధ విద్యార్థులు, అంధ ఉద్యోగులు, ఉపాధ్యాయులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

ఆట మొదలైంది..

» ఎమ్మెల్యేలకు ప్రతిష్టాత్మకంగా స్థానిక ఉప ఎన్నికలు

» వచ్చే ఎన్నికలపై ఫలితాల ప్రభావం

» అన్ని పార్టీలకూ తప్పని పరిస్థితి

(ఆంధ్రజ్యోతి, ఆసిఫాబాద్)

సార్వత్రిక ఎన్నికలు తరుముకొస్తున్నాయి. జిల్లాలో అనివార్యంగా వచ్చిపడిన స్థానిక ఉప ఎన్నికలు అధికార పార్టీకి ఎన్నికలకు ముందు మొదటి పరీక్షగా మారాయి. ముఖ్యంగా ఈ స్థానిక ఉప ఎన్నికలు ఎమ్మెల్యేలకు ప్రతిష్టాత్మకంగా మారాయి. అధికార పార్టీకి సంబంధించి ఫలితాల్లో ఏ మాత్రం తేడా వచ్చినా మొత్తంగా వచ్చే ఎన్నికలపై ప్రభావం చూపే అవకాశం ఉండడంతో ఆసిఫాబాద్, సిర్పూర్ ఎమ్మెల్యేలు పక్షం రోజులుగా దీనిపై తీవ్రస్థాయిలో కసరత్తు చేశారు. అటు మిగతా రాజకీయ పక్షాలకు స్థానిక ఉప ఎన్నిక ప్రీ ఫైనల్‌గా మారడంతో సత్తా చాటే లక్ష్యంతో కసరత్తు జరిపారు. అయితే అనూహ్యంగా ఆసిఫాబాద్ సెగ్మెంట్‌లోని సిర్పూర్(యు) మండలం నెట్నూర్ స్థానానికి ఒకే ఒక నామినేషన్ దాఖలు కావడం.. అది కూడా అధికార పార్టీకి చెందిన అభ్యర్థియే కావడంతో ఇక్కడ ఎన్నిక దాదాపుగా ఏకగ్రీవమైనట్లే. నామినేషన్ల తుది గడువు ముగిసి పరిశీలన కూడా పూర్తి అయ్యింది. ఇక అధికారులు దీనిపై అధికారిక ప్రకటన చేయడమే మిగిలింది.

కౌటాలలో సీన్ వేరు..

మరోవైపు కౌటాల ఎంపీటీసీ స్థానానికి అధికార పార్టీ నుంచి ఎలాంటి అసమ్మతి లేక పోయినా ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీలో ముగ్గురేసి అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేయడంతో ఆ పార్టీలో కొంత అనిశ్చితి కనిపిస్తోం ది. మరోవైపు మారిన రాజకీయ పరిణామాల నేపథ్యంలో కౌటాల ఉప ఎన్నిక అన్ని పార్టీల నేతలు ప్రతిష్టాత్మకంగా తీసుకుని సర్వశక్తులొడ్డుతున్నారు. ముఖ్యంగా ఈ స్థానాన్ని చేజిక్కించుకోవడం ద్వారా సిట్టింగ్ ఎమ్మెల్యేకు సవాల్ విసరాలన్న పట్టుదలతో ప్రధాన ప్రతిపక్షాలైన కాంగ్రెస్, టీడీపీ, బీజేపీ, స్వతంత్ర అభ్యర్థులు తమదైన శైలీలో రాజకీయం నెరపుతున్నారు. ఈ ఎన్నికల్లో గెలిస్తే.. ఈ విజయం తాలూకు ప్రభావం వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ప్రచారానికి వాడుకోవచ్చన్న వ్యూహం ఆయా పార్టీల్లో కనిపిస్తున్నట్లు రాజకీయ విశ్లేషకులు అంచనావేస్తున్నారు. జిల్లాకు సంబంధించి ఈ



కౌటాలలో నామినేషన్ పత్రాలను అందజేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి దోబె స్వప్న(ఫైల)

రెండుస్థానాల్లోనే ఉప ఎన్నికలు జరుగుతున్నప్పటికీ ప్రస్తుతం రాజకీయ విశ్లేషకుల దృష్టి మొత్తం ఈ ఎన్నికల వాటిపైనే కేంద్రీకృతమై ఉంది. ఇందులో సిర్పూర్(యు) ఏకగ్రీవం ఖాయం కావడంతో కౌటాల ఎన్నికపై జోరుగా చర్చలు సాగుతున్నాయి.

సిర్పూర్(యు) మండలం నెట్నూర్ గ్రామానికి చెందిన ఉర్వేత హన్మంతరావు 2014 లో జరిగిన ఎంపీటీసీ ఎన్నికల్లో ఎస్టీ జనరల్ అభ్యర్థిగా టీడీపీ నుంచి పోటీ విజయం సాధించారు. అయితే ఇటీవల ఆయన హఠాత్తుగా మరణించడంతో ఈ స్థానానికి ఉప ఎన్నిక అనివార్యమైంది. ఇక్కడ ఇతర పార్టీల నుంచి ఎవరు నామినేషన్ దాఖలు చేయకపోవడంతో టీఆర్‌ఎస్ పుర్క చలాబాయి ఎన్నిక ఖాయమైంది. మరోవైపు సిర్పూర్ నియోజకవర్గ పరిధిలోకి వచ్చే కౌటాల ఎంపీటీసీ స్థానం నుంచి బీఎస్పీ పార్టీ తరపున పోటీ చేసి టీఆర్‌ఎస్ అభ్యర్థిపై చదువుల జ్యోతి శ్రీనివాస్ విజయం సాధించారు. ఆ తరువాత చోటు చేసుకున్న పరిణామాల్లో స్థానిక ఎమ్మెల్యే కోనేరు కోనప్పతో పాటు టీఆర్‌ఎస్ తీర్థం పుచ్చుకున్నారు. ముందుగా కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం రెండున్నర సంవత్సరాల చొప్పున ఎంపీపీ పదవిని పంచుకునేందుకు ఒప్పందం కుదుర్చుకున్న ఇటీవల కాలం సదరు ఎంపీపీ చదువుల జ్యోతి శ్రీనివాస్ రాజీనామాకు ససేమీరా అన్నారు. అయినప్పటికీ ఒత్తిడి తీవ్రతరం కావడంతో అటు ఎంపీపీ పదవితో పాటు ఎంపీటీసీ స్థానానికి రాజీనామా సమర్పించడంతో ఇక్కడ ఉప ఎన్నిక అనివార్యమైంది. దాంతో కౌటాల ఎంపీటీసీ ఎన్నికలు నియోజకవర్గ అగ్రనేతలకు జీవన్మరణ సమస్యగా తయారైంది. మొదట్లో కొంత గందరగోళ పరిస్థితి ఏర్పడినా స్థానిక ఎమ్మెల్యే కోనేరు కోనప్ప పోటీ చేసే ఉత్సాహం చూపిన అభ్యర్థులకే వదిలివేయడంతో పార్టీలో అంతర్గతంగా చర్చించి ఏకగ్రీవంగా అభ్యర్థి పేరును ప్రతిపాదించారు. దాంతో టీఆర్‌ఎస్ నుంచి పసునూరి స్వప్న నామినేషన్ దాఖలు చేశారు. మరో వైపు కాంగ్రెస్ నుంచి ముగ్గురు మహిళలు నామినేషన్ దాఖలు చేశారు. బుధవారం నాటికి ఈ పార్టీ అభ్యర్థి ఎంపిక కొలిక్కి రాలేదు.

ఇందుకు కారణం లేకపో లేదు. ఈ నియోజకవర్గంలో జడ్పీ మాజీ ఛైర్మన్ సిడాం గణపతి, రావి శ్రీనివాస్ వర్గాల మధ్య ఇంకా సయోధ్య కుదరకపోవడమే ఈ పరిస్థితి కారణమని పరిశీలకులు చెబుతున్నారు. ఇకపోతే బీజేపీ నుంచి తాళ్లపల్లి మంజూల, టీడీపీ నుంచి జటంగుల శారద, స్వతంత్ర అభ్యర్థిగా లోడెల్లి పుష్పలతలు బరిలో ఉన్నారు. ఇందులో పుష్పలతకు మాజీ ఎమ్మెల్యే పాల్వాయి రాజ్యలక్ష్మి తనయుడు పాల్వాయి హరీష్‌బాబు మద్దతుగా రంగంలోకి దిగడంతో ఇక్కడ రాజకీయం రసకందాయంలో పడింది. మొత్తంగా ఇవి స్థానిక ఉప ఎన్నికలే అయినప్పటికీ సార్వత్రిక ఎన్నికలకు ముందు జరుగుతుండడంతో జిల్లాలో రాజకీయంగా ఆసక్తి రేపుతోంది.

చక్రం తిప్పిన నేతలు..

జిల్లాలో రెండు ఎంపీటీసీ స్థానాలకు జరుగుతున్న ఉప ఎన్నికలు అధికార పార్టీకి అత్యంత ముఖ్యమైనవి కావడంతో ఇటు ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి, ఎమ్మెల్సీ పురాణం సతీష్, సిర్పూర్ ఎమ్మెల్యే కోనేరు కోనప్పలు నియోజకవర్గంలోనే తిష్ట వేసి మూడు నాలుగు రోజులుగా చక్రం తిప్పారు. అభ్యర్థి ఎన్నిక మొదలు నామినేషన్ వరకు అత్యంత వ్యూహాత్మకంగా వ్యవహరించి ప్రత్యర్థులకు ఏ మాత్రం అంతుచిక్కని రీతిలో వ్యూహాలు రచించారు. ఇందులో ఆదిలాబాద్ ఎమ్మెల్సీ పురాణం సతీష్ సోమ, మంగళవారాల్లో ఆసిఫాబాద్‌లోనే మకాం వేసి నెట్నూర్ ఎంపీటీసీ స్థానానికి టీఆర్‌ఎస్ మినహా ఇతర పార్టీలకు చెందిన అభ్యర్థులు ఎవరూ బరిలోకి దిగకుండా చక్రం తిప్పారు. ఈ క్రమంలో టీఆర్‌ఎస్ అభ్యర్థిగా ఎంపిక చేసిన పుర్క చలాబాయి నామినేషన్ ఒక్కటే దాఖలు కావడంలో ఆయన రాజకీయ చతురత ప్రదర్శించినట్లు టీఆర్‌ఎస్ వర్గాలు చెబుతున్నాయి.

మరోవైపు కౌటాలలో పోటీ అధికంగా ఉన్నా స్థానిక నేతలపైనే భారం మోపి ఎమ్మెల్యే కోనప్ప వ్యూహాత్మకంగా ఒత్తిడి పెంచడం ఫలించింది. దాంతో టీఆర్‌ఎస్ నుంచి ఒకరికి మించి అభ్యర్థులు బరిలో దిగకుండా చూడడంలో ఆయన విజయం సాధించారు. అంతే కాకుండా అభ్యర్థి గెలుపు భారాన్ని కూడా వార్డుల వారీగా ముఖ్యనేతలకు అప్పగించి ప్రత్యర్థుల ఎత్తులకు దీటుగా బూతX ల వారీగా ఓటర్లను ఆకర్షించేందుకు ప్రత్యేక కార్యాచరణ అమలుచేస్తున్నారు.

మంచిర్యాలలో ఫోరెన్సిక్ ల్యాబ్

» ఏడు నెలల్లో ఏర్పాటు

» రూ.50 లక్షల కేటాయింపు

» కేసుల దర్యాప్తు ఇక వేగవంతం

మంచిర్యాల క్రైం, జనవరి 3: జిల్లాకు ఫోరెన్సిక్ ల్యాబ్‌ను మంజూరైంది. ఈమేరకు రాష్ట్రసర్కారు రూ.50 లక్షలు కేటాయించింది. అందుబాటులో ఉన్న భవనాల్లో ఏడు నెలల్లో ఏర్పాటు చేయాలని ఆదేశించింది. ప్రస్తుతానికి సిరాలజీ, టాక్సాలజీ విభాగాలు అందుబాటులోకి రానున్నాయి.

● నేర పరిశోధన వేగవంతం..

జిల్లాలో ఫోరెన్సిక్ ల్యాబ్ ఏర్పాటు ద్వారా నేర పరిశోధన వేగవంతం కానుంది. గతంలో హత్యలు, ఆత్మహత్యలు, లైంగికదాడులు, దొంగతనాలు జరిగినప్పుడు బాధితులు, నిందితుల వేలిముద్రలు, రక్తపు మరకలతో పాటు మృతులకు సంబంధించి పోస్టుమార్టం అనంతరం వివిధ అవయవాలను హైదరాబాద్ పంపాల్సి వచ్చేది. రాష్ట్రవ్యాప్తంగా నమూనాలన్నీ హైదరాబాద్‌లోనే విశ్లేషించాల్సి రావడంతో రిపోర్టులు వచ్చేసరికి ఒక్కోసారి నెలలు గడిచిపోయేవి. దీంతో ఆయా కేసుల దర్యాప్తు ముందుకుసాగేది కాదు. హత్యలు, ఆత్మహత్యలకు సంబంధించి పోస్టుమార్టం నివేదికే అత్యంత కీలకం. రామగుండం కేంద్రంగా కమిషనరేట్ ఏర్పాటుచేసిన ప్రభుత్వం, ఇక్కడ ఫోరెన్సిక్ ల్యాబ్ లేకపోవడం వల్ల కేసుల దర్యాప్తు నత్తనడకన సాగుతుందనే విషయాన్ని గుర్తించే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తున్నది.

● రెండు విభాగాలు..

జిల్లాకేంద్రంలో ఏర్పాటుచేయనున్న ఫోరెన్సిక్ ల్యాబ్‌లో సీరాలజీ, టాక్సాలజీ విభాగాలుంటాయి. సీరాలజీ ద్వారా రక్తనమూనాలను, టాక్సాలజీ ద్వారా వివిధ శరీర అవయవాలను విశ్లేషిస్తారు. తద్వారా ఒక వ్యక్తి ఏ రకంగా మరణించినదీ తెలుసుకోవచ్చు. ఇందుకోసం ల్యాబ్‌లో ప్రత్యేక శిక్షణ పొందిన సిబ్బందిని నియమించనున్నారు.

● దర్యాప్తు వేగవంతం..

-విక్రంజీత్ దుగ్గల్, పోలీస్ కమిషనర్, రామగుండం



ప్రభుత్వం కమిషనరేట్ పరిధిలో ఫోరెన్సిక్ ల్యాబ్ ఏర్పాటుకు నిర్ణయించింది. మంచిర్యాలలో ప్రాంతీయ కార్యాలయం ఏర్పాటు చేయడం వల్ల కేసుల దర్యాప్తు వేగవంతమవుతుంది. తద్వారా నేరస్థులకు శిక్ష పడడమే కాకుండా బాధితులకు న్యాయం జరుగుతుంది. ఏడు నెలల్లో ల్యాబ్‌ను పూర్తిచేసేలా అన్ని చర్యలూ తీసుకుంటాం.

● నేరస్థులను సులువుగా పట్టుకోవచ్చు..

-డీసీపీ వేణు గోపాల్‌రావు

గతంలో నేరస్థులను పట్టుకునేందుకు ఘటనాస్థలిలో లభించిన వేలిముద్రలతో ఆయా పోలీస్‌స్టేషన్‌లో రికార్డు చేసిన వేలిముద్రలను పోల్చిచూడాల్సి వచ్చేది. ఇది ఎంతో కష్టమైన పని. కానీ లైవ్ స్కానర్ ద్వారా దేశవ్యాప్తంగా ఉన్న నేరస్థుల వేలి ముద్రలను పొందుపరిచి, అవసరమున్నప్పుడు సులభంగా గుర్తించవచ్చు. ప్రస్తుతం జిల్లాలో లైవ్‌స్కానర్ అందుబాటులోకి వచ్చింది. అలాగే జిల్లా కేంద్రానికి ఫోరెన్సిక్ ల్యాబ్ మంజూరైంది. ఫలితంగా కేసుల దర్యాప్తు వేగవంతమవుతుంది.

అందుబాటులోకి లైవ్ స్కానర్..

జిల్లాకేంద్రంలోని డీసీపీ కార్యాలయంలో ఇప్పటికే అధునాతన లైవ్ స్కానర్‌ను ఏర్పాటుచేశారు. సుమారు రూ. 8 లక్షల విలువ చేసే ఈ యంత్రాన్ని ప్రత్యేకంగా రష్యా నుంచి తెప్పించారు. దేశంలోనే ఇది మొదటిదని పోలీస్ అధికారులు చెబుతున్నారు. 2007 నుంచి దొంగతనాలకు పాల్పడిన వారి వేలు ముద్రలను ఆన్‌లైన్ ద్వారా ఇందులో పొందుపరుస్తున్నారు. తద్వారా దేశంలో ఎక్కడైనా దొంగతనాలు, ఇతరత్రా అసాంఘిక కార్యకలాపాలు జరిగినా ఘటనాస్థలంలో లభించిన వేలి ముద్రలను ఈ వేలిముద్రలతో పోల్చి చూడడం ద్వారా నేరస్థులను గుర్తించే వీలుంటుంది. త్వరలోనే ప్రతి మండలంలోనూ లైవ్ స్కానర్ ఏర్పాటుకు ప్రభుత్వం ప్రయత్నిస్తున్నదని పోలీస్ వర్గాల ద్వారా తెలిసింది.



డీసీపీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన లైవ్ స్కానర్


దినఫలాలు

అదృష్టసంఖ్యలు: 3, 7, 4


మేషరాశి: (మార్చి21-ఏప్రిల్20): చిన్నారుల విషయాల్లో శుభపరిణామాలు సంభవం. చిట్‌ఫండ్లు, డిపాజిట్లపై ప్రతిఫలం అందుకుంటారు. ప్రముఖులతో వేడుకల్లో పాల్గొంటారు. మీ ప్రతిభకు గుర్తింపు లభిస్తుంది. ఆర్థిక విషయాల్లో సంకల్పం నెరవేరుతుంది.


వృషభరాశి: (ఏప్రిల్21-మే20): మార్పు కోసం చేసే ప్రయత్నాలు ఫలిస్తాయి. బదిలీల విషయంలో వ్యూహాత్మకంగా వ్యవహరించి లక్ష్యం సాధిస్తారు. బంధుమిత్రుల కలయికతో ఇంట్లో సందడిగా ఉంటుంది. ఇంటికి అవసరమైన వస్తువుల రవాణాకు అనుకూలం.


మిథునరాశి: (మే21-జూన్21): చెక్కులు, విలువైన డాక్యుమెంట్లు అందుకుంటారు. స్టేషనరీ, రవాణా, బోధన, ఏజెన్సీ రంగాల వారికి ఆర్థికంగా ప్రోత్సాహకరం. సోదరీ సోదరుల విషయాల్లో శుభపరిణామాలు సంభవం. మిత్రుల కలయిక ఆనందం కలిగిస్తుంది.


కర్కాటకరాశి: (జూన్22-జూలై23): ప్రియతముల కోసం విలువైన వస్తువుల కొనుగోలు చేస్తారు. వేడుకల్లో పాల్గొంటారు. భాగస్వామ్యాలు లాభిస్తాయి. స్నేహ పరిచయాల ఆధారంగా ఆర్థిక పరమైన లక్ష్యాలు సాధిస్తారు. బహుమతులు ఇచ్చిపుచ్చుకుంటారు.


సింహరాశి: (జూలై24-ఆగస్ట్23): ఉద్యోగ ప్రయత్నాలు ఫలిస్తాయి. కొత్త ప్రాజెక్టుల ప్రారంభానికి అనుకూల సమయం. విందు, వినోదాలతో ఉల్లాసంగా గడుపుతారు. ఉద్యోగ సంస్థలు, పరిశ్రమలు, వైద్య రంగాల వారికి కొత్త ఆలోచనలు స్ఫురిస్తాయి.


కన్యారాశి: (ఆగస్ట్24-సెప్టెంబర్23): దూరంలో ఉన్న ప్రియతములు ఇల్లు చేరతారు. ప్రయాణాలు, చర్చలు, వేడుకలు ఉల్లాసం కలిగిస్తాయి. సినీ, రాజకీయ, న్యాయ రంగాల వారికి ఆర్థికంగా అనుకూలిస్తుంది. ప్రియతములకు సంబంధించి కీలక సమాచారం అందుకుంటారు.


తులారాశి: (సెప్టెంబర్24-అక్టోబర్23): వేడుకలకు ఏర్పాట్లు చేస్తారు. ఇంటి కోసం విలువైన వస్తువులు సమకూర్చుకుంటారు. బంధు, మిత్రులతో ఉల్లాసంగా గడుపుతారు. ప్రదర్శనలు, సభలకు అనుకూలం. ఆర్థిక విషయాల్లో సన్నిహితుల వైఖరి గురించి ఆలోచిస్తారు.


వృశ్చికరాశి: (అక్టోబర్24-నవంబర్22): ఉద్యోగ, వ్యాపారాలకు సంబంధించిన శుభవార్త అందుకుంటారు. సోదరీ సోదరుల విషయాల్లో శుభ పరిణామాలు సంభవం. పెద్దలతో సమావేశాలు ఉల్లాసం కలిగిస్తాయి. వృత్తి, ఉద్యోగాలకు సంబంధించిన కీలక సమాచారం లభిస్తుంది.


ధనూరాశి: (నవంబర్23-డిసెంబర్21): ప్రయణాలకు అవసరమైన నిధులు సమకూర్చుకుంటారు. సంకల్పం ఫలిస్తుంది. వేడుకల్లో పాల్గొంటారు. ప్రణాళికాబద్ధంగా వ్యవహరించి ఆర్థికపరమైన లక్ష్యాలు సాధిస్తారు. పెట్టుబడులకు సంబంధించిన వివరాలు సేకరిస్తారు.


మకరరాశి(డిసెంబర్22-జనవరి21): బీమా వ్యవహారాలకు అనుకూలం. ఆర్థిక వ్యవహారాలపై స్పష్టమైన నిర్ణయానికి వస్తారు. ఆత్మావలోకనం చేసుకునేందుకు తగిన సమయం. పూర్వమిత్రులను కలుసుకుంటారు. మ్యూచ్యువల్ ఫండ్స్, బ్యాంకు లావాదేవీలు లాభిస్తాయి.


కుంభరాశి: (జనవరి22-ఫిబ్రవరి18): సినీ, రాజకీయ రంగాల వారికి కొత్త పరిచయాలు లాభిస్తాయి. భాగస్వామి గురించి ఆలోచిస్తారు. లక్ష్య సాధనకు పరిచయాలు తోడ్పడతాయి. సమావేశాలు, బృందకార్యక్రమాల్లో పాల్గొంటారు. దూర ప్రాంతాల్లో ఉన్న వ్యక్తులతో అనుబంధం ఏర్పడుతుంది.


మీనరాశి: (ఫిబ్రవరి19మార్చి20): ఉద్యోగ ప్రయత్నాలు ఫలిస్తాయి. వైద్యం, హోటల్, రిటైల్ రంగాల వారికి ఆర్థికంగా ప్రోత్సాహకరం. ఆహార నియమాలు పాటిస్తారు. బంధుమిత్రులతో విందు వినోదాల్లో పాల్గొంటారు. ఆస్పత్రులు సందర్శిస్తారు.

-బిజుమళ్ళ బిందుమాధవ శర్మ

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి

▸▸ మంచిర్యాల జిల్లా విద్యాశాఖ అధికారి రవికాంత్‌రావు

మంచిర్యాల రూరల్, జనవరి3: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించి జాతీయ స్థాయిలో పథకాలు తేవాలని మంచిర్యాల జిల్లా విద్యాశాఖ అధికారి రవికాంత్‌రావు సూచించారు. బుధవారం హాజీపూర్ మండలంలోని శ్రీవిద్యారణ్య ఆవాస విద్యాలయంలో శిశుమందిరాల విభాగ్ స్థాయి ఖేల్‌కూద్ పోటీల సందర్భంగా ఆయన మాట్లాడారు. శ్రీ సరస్వతి శిశు మందిర పాఠశాలల్లో చదువు, ఆటలు, నైతిక విలువలు నేర్పుతారన్నారు. విద్యార్థులు ఖేల్‌కూద్ పోటీల్లో పాల్గొనడం అదృష్టంగా భావించాలన్నారు. గెలుపు, ఓటములను సమానంగా స్వీకరించాలని ఆయన విద్యార్థులకు సూచించారు. ఓడిన వారు మళ్లీ ప్రయత్నించి గెలుపొందాలన్నారు. తల్లిదండ్రులు క్రీడలపై దృష్టి పెట్టాలన్నారు. అనంతరం జిల్లా వెహికల్ ఇన్‌స్పెక్టర్ గుర్రం వివేకానందరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆవాస పాఠశాల అధ్యక్షుడు వినయ్ ప్రకాష్ రాజు, మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రావు, రామగుండం వెహికిల్ ఇన్‌స్పెక్టర్ పుస్కూరి రంగారావు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రామన్న పాల్గొన్నారు.

శ్రీ విద్యారణ్య ఆవాస విద్యాలయం చొక్కారాంనగర్‌లో విభాగ్ స్థాయి ఖేల్‌కూద్ పోటీలు హోరాహోరీగా జరిగాయి. ఈ పోటీల్లో మంచిర్యాల, కుమరంభీం ఆసిఫాబాద్, పెద్దపల్లి, కరీంనగర్, రాజన్న, సిరిసిల్లలకు చెందిన శిశు మందిరాలకు సంబంధించిన 500 మంది విద్యార్థులు ఈ ఖేల్‌కూద్ పోటీల్లో పాల్గొన్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. పరుగుపందెం, లాంగ్‌జంప్, హైజంప్, షాట్‌పుట్, జావెల్లింగ్‌త్రో, కోకో, కబడ్డీ తదితర పోటీలను నిర్వహించారు. వంద మీటర్ల పరుగుపందెంలో టీ పూర్ణచందర్, 200 మీటర్ల పరుగుపందెంలో ఎం.వేణు, షాట్‌పుట్‌లో జ్ఞానేశ్వర్, డిస్క్‌త్రోలో జ్ఞానేశ్వర్, లాంగ్‌జంప్‌లో ఎస్ శ్రీకాంత్, హైజంప్‌లో పూర్ణచందర్, ఖోఖోలో రాంపూర్ ఆవాస విద్యాలయం ప్రథమ బహుమతులను గెలుచుకున్నారు.



మాట్లాడుతున్న డీఈవో రవికాంత్‌రావు


ఖోఖో ఆడుతున్న విద్యార్థినులు

రాష్ట్ర స్థాయి అండర్-14 క్రికెట్ జట్టుకు సృంజిత్ రెడ్డి ఎంపిక

ఆంధ్రజ్యోతి, నిర్మల్, జనవరి3: జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు ఏలేటీ మహేశ్వర్‌రెడ్డి తనయుడు సృంజిత్ రెడ్డి రాష్ట్రస్థాయి అండర్-14 క్రికెట్ జట్టుకు ఎంపికయ్యాడు. 11 యేళ్ల వయసున్న సృంజిత్‌రెడ్డి ఈనెల 7 నుంచి 21 వరకు కేరళ రాష్ట్రంలో జరిగే జాతీయ స్థాయి పోటీలకు తెలంగాణ రాష్ట్రం తరపున ప్రాతినిధ్యం వహించనున్నాడు. ఇప్పటికే పలు మ్యాచ్‌ల్లో పాల్గొని అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన సృంజిత్‌రెడ్డి ఆల్‌రౌండర్‌గా రాష్ట్ర జట్టుకు ఎంపికయ్యాడు. గత 9 మ్యాచ్‌ల్లో అతడు నాలుగు సార్లు ఐదు వికెట్లు, మూడుసార్లు నాలుగు వికెట్లను మొత్తం 33 వికెట్లు సాధించి అత్యుత్తమ ఆల్‌రౌండర్‌గా ప్రతిభను చాటుకున్నాడు. ఈ ప్రతిభ ఆధారంగా హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ సృంజిత్‌రెడ్డిని అండర్-14 రాష్ట్ర జట్టుకు ఎంపిక చేసింది. ఈ నెల 5న ఆయన కేరళకు జట్టు సభ్యులతో కలిసి వెళ్లనున్నారు. కాగా సృంజిత్‌రెడ్డి రాష్ట్ర జట్టులో స్థానం సాధించడం పట్ల పలువురు నిర్మల్ జిల్లా క్రికెట్ అభిమానులు అభినందనలు తెలిపారు.



సిద్దిపేటను ఆదర్శంగా తీసుకుంటాం

సిద్దిపేట మునిసిపాలిటీ, జనవరి3: అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతున్న సిద్దిపేటను ఆదర్శంగా తీసుకొని తమ పట్టణాన్ని అభివృద్ధి చేసుకుంటామని మంచిర్యాల మునిసిపల్ కమిషనర్ శ్రీకాంత్ అన్నారు. బుధవారం ఆయన సిద్దిపేట మునిసిపాలిటీని సందర్శించి పట్టణ పరిధిలో జరుగుతున్న పనులను పరిశీలించారు. డీఆర్‌సీ సెంటర్, సేంద్రియ ఎరువుల తయారీ, వైకుంఠధామం, స్మృతివనం తదితర ప్రదేశాలను పరిశీలించారు. కార్యక్రమంలో సిద్దిపేట మునిసిపల్ చైర్మన్ రాజనర్సు, కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ చేపట్టాలని వినతి

మంచిర్యాల అర్బన్, జనవరి3: ఎస్సీ వర్గీకరణ, డప్పు, చెప్పు వృత్తుల వారికి రూ.2 వేల పెన్షన్ ఇవ్వాలని మంచిర్యాల జిల్లా సంయుక్త పాలనాధికారి వై.సురేందర్‌రావుకు బుధవారం ఎంఆర్‌పీఎస్ నాయకులు వినతి పత్రాన్ని అందజేశారు. ఎస్సీ వర్గీకరణపై ఎంఆర్‌పీఎస్ పోరాటం చేస్తున్నప్పటికీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఎస్సీ వర్గీకరణకు ప్రభుత్వం చొరవ తీసుకొని చట్టబద్ధత కల్పించాలని కోరారు. సంయుక్త పాలనాధికారికి వినతిపత్రాన్ని అందజేసిన వారిలో కాశి సతీష్‌కుమార్ మాదిగ, ఎంఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షులు , తదితరులు ఉన్నారు.

గూడెం సత్యదేవుని ఆలయ హుండీ లెక్కింపు

▸▸ రూ. 2లక్షల 45వేల 875 ఆదాయం

దండేపల్లి జనవరి3: దండేపల్లి మండలం గూడెం గుట్ట శ్రీ సత్యనారాయణ స్వామి దేవాలయానికి పుష్యపౌర్ణమి సందర్భంగా రూ.2లక్షల 45వేల 875 ఆదాయం వచ్చినట్లు ఆలయ నిర్వహణాధికారి టి.నారాయణ, ఆలయ చైర్మన్ గోవర్ధన వెంకటస్వామిలు వెల్లడించారు. గూడెం శ్రీ సత్యనారాయణ స్వామి ప్రధాన ఆలయంలో బుధవారం దేవదాయ, ధర్మదాయశాఖ నిర్మల్ డివిజనల్ ఇన్‌స్పెక్టర్ రంగు రవికిషన్‌గౌడ్, ఆలయ వ్యవస్థాపక కుటుంబ సభ్యులు చైర్మన్ గోవర్ధన వెంకటస్వామి ఆధ్వర్యంలో పుష్య పౌర్ణమి హుండీని లెక్కించారు. భక్తులు స్వామివారికి కానుకగా వేసిన ఆదాయం రూ.1,32,016 రాగా రశీదులు, వ్రతాలు, ఇతరుల ద్వారా రూ.1,13,859 ఆదాయం వచ్చింది. గత ఏడాది పౌర్ణమి జాతరకు దేవాలయానికి రూ.లక్షా 61 వేల 312 ఆదాయం సమకూరింది. గత ఎడాది కంటే ఈసారి రూ.84,563 ఆదాయం ఎక్కువగా వచ్చింది. ఈ హుండీ లెక్కింపులో ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు కొండు సత్తయ్య, ఆకుల తిరుపతి, కనగంటి తిరుపతి, సాయిని సుధాకర్, మారశెట్టి సత్తవ్వ, ఆలయ సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు రమణారావు, సత్యనారాయణ, అంజన్న, శ్రీసత్యనారాయణస్వామి సేవాసమితి నిర్వాహకులు, సభ్యులు పాల్గొన్నారు.

పులుల గణనపై అవగాహన


అటవీ సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న ఎఫ్‌డీఓ రాజారాం

కోటపల్లి, జనవరి3: ఈ నెల 22 నుంచి 28 వరకు అటవీ ప్రాంతంలో నిర్వహించే పులుల గణనపై అటవీ శాఖ సిబ్బందికి బుధవారం కోటపల్లి రేంజ్ కార్యాలయంలో చెన్నూర్ డివిజనల్ అటవీ అభివృద్ధి అధికారి రాజారాం అవగాహన కల్పించారు. ప్రతి బీట్ అధికారికి ఇద్దరు వలంటీర్లను నియమించి బృందాలుగా ఏర్పాటు చేశారు. ప్రతి నిత్యం ఉదయం 6గంటల నుంచి ఐదు కిలో మీటర్ల మేర లైన్ వెంట తనిఖీలు చేపట్టడం, మాంసహార జంతువుల మల, మూత్ర విసర్జనలు, వెంట్రుకలు, అడుగులు తదితర అంశాలను గుర్తుపట్టే విధానంపై సిబ్బందికి వివరించారు. అలాగే అటవీ ప్రాంత ఎంత ఉంది, మైదాన ప్రాంతం ఎంత ఉందో, వృక్ష, గడ్డి జాతుల వివరాలు, పులుల జాడలు, పులి పిల్లలు ఉంటే వాటి వివరాలను సేకరించాలని ఎఫ్‌డీఓ రాజారాం సూచించారు. ఈ సమావేశంలో కోటపల్లి, నీల్వాయిల అటవీ శాఖ రేంజర్ రవి, అరవింద్, డిప్యూటీ రేంజర్ రేష్మ, బీట్ అధికారులు నాగరాజు చారి, స్వప్నలతోపాటు రేంజ్ సిబ్బంది పాల్గొన్నారు.

'కీటక జనిత వ్యాధులను నియంత్రించాలి'

మంచిర్యాల అర్బన్, జనవరి3: కీటక జనిత వ్యాధులను నియంత్రించాలని మంచిర్యాల జిల్లా మలేరియా అధికారి విజయ పూర్ణిమ సూచించారు. జిల్లా ఉప వైద్యాధికారి కార్యాలయంలో బుధవారం సూపర్‌వైజర్లు, ల్యాబ్‌టెక్నిషియన్లు, హెల్త్ అసిస్టెంట్లతో కీటక జనిత వ్యాధులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దోమల నివారణ చర్యలు చేపట్టి ప్రజల్లో అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. క్షేత్ర స్థాయి నుంచి పంపిన రక్త పూతలను సకాలంలో పరీక్షించి ఫలితాలను వెల్లడించాలని ల్యాబ్ టెక్నీషియన్‌లకు సూచించారు. ఉప వైద్యాధికారి జ్యోతి మాట్లాడుతూ మలేరియా, డెంగ్యూ నిర్ధారించబడితే ఆ ప్రాంతాల్లో ప్రత్యేక వైద్య ఆరోగ్య శిబిరాలను నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో సామాజిక ఆరోగ్య అధికారి వెంకటేశ్వర్లు అల్లాడి శ్రీనివాస్, తొగరి ప్రభాకర్, నాందేవ్, పుట్ట సత్తయ్య, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

ఓసీపీ-3లో రిటైర్డ్ కార్మికులకు సన్మానం

యైటింక్లయిన్‌కాలనీ, జనవరి3: ఓసీపీ-3లో బుధవారం ఉద్యోగ విరమణ పొందిన కార్మికులను యాజమాన్యం ఘనంగా సన్మానించింది. ఓల్డ్‌సైటాఫీస్‌లో జరిగిన కార్యక్రమంలో ఎస్‌పీవీ ప్రసాదస్వామి (ఈపీ ఎలక్రిషియన్), రజలిఖాన్ (ఎంవీ డ్రైవర్), ఇట్టవేన నర్సయ్య (ఎక్స్‌ప్లోజివ్ క్యారియర్), బూరుగుల శంకరయ్య (జనరల్‌మజ్దూర్), బేస్‌వర్క్‌షాప్‌లో ఎండీ కుతుబుద్దీన్ (మోటార్ మెకానిక్), తమ్మడబోయిన మల్లేశం (ఈపీ గ్రీజర్‌హెల్పర్)లను సత్కరించి, బహుమతులను అందజేశారు. వారికి రావాల్సిన బెన్‌ఫిట్స్ పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో పీఈ దుర్గాప్రసాద్, అధికారులు రాముడు, పైడీశ్వర్, సంపత్‌కుమార్ పాల్గొన్నారు.

ఉత్పత్తి లక్ష్యసాధనపై యాజమాన్యం దృష్టి

ఈ ఆర్థిక సంవత్సర లక్ష్యం 66.06 మిలియన్ టన్నులు • ఇప్పటి వరకు సాధించింది 42 మిలియన్ టన్నులు

(ఆంధ్రజ్యోతి-మంచిర్యాల)

సింగరేణి యాజమాన్యం 2017-18 ఆర్థిక సంవత్సరం బొగ్గు ఉత్పత్తి లక్ష్య సాధనపై దృష్టి సారించింది. మార్చి 31న ఆర్థిక సంవత్సరం ముగుస్తుంది. అంటే లక్ష్యసాధనకు ఇంకా 87 రోజులే మిగిలి ఉంది. ఈ ఆర్థిక సంవత్సరంలో యాజమాన్యం 66.06 మిలియన్ టన్నుల లక్ష్యాన్ని పెట్టుకుంది. అయితే ఆర్థిక సంవత్సరంలో డిసెంబర్ 31, 2017 నాటికి పది నెలల్లో 42మిలియన్ టన్నులు మాత్రమే సాధించింది. 87 రోజుల్లో మిగిలిన 24.06 మిలియన్ టన్నులు సాధించాల్సి ఉంది. సోమ, మంగళవారాల్లో 4 లక్షల పైచిలుకు టన్నులు మాత్రమే బొగ్గు ఉత్పత్తి జరిగింది. ఇటీవల ఒక రోజు రికార్డు 2.12 లక్షల టన్నులుగా నమోదైంది. 87 రోజుల్లో ఎంత సాధించినా 66 మిలియన్ టన్నులు చేరుకోవడం అసాధ్యమనే చెప్పవచ్చు.

ప్రతి రోజు 2.1 లక్షల నుంచి 2.2 లక్షల టన్నులు సాధిస్తే 63 మిలియన్ టన్నులు లక్ష్యం దాటే పరిస్థితి ఉంది. దీంతో 66.06 మిలియన్ టన్నుల లక్ష్యం సాధించే అవకాశం ఈ ఆర్థిక సంవత్సరంలో కనపడడం లేదు. అయితే అంతర్గతంగా సంస్థకు ప్రభుత్వం నిర్ణయించిన లక్ష్యం 63 మిలియన్ టన్నులే ఉంది. ప్రతి సంవత్సరం ప్రభుత్వం నిర్ణయించిన లక్ష్యానికి మూడు, నాలుగు మిలియన్‌లు జోడించి అధిక ఉత్పత్తి చేయడం అటు కోల్ ఇండియాలోనైనా, ఇటు సింగరేణిలోనైనా ఆనవాయితీగా వస్తోంది. పరిస్థితులకు అనుగుణంగా ఉత్పత్తి లక్ష్యాలను పెంచడం, తగ్గించుకోవడం జరుగుతుంటుంది.



భూగర్భగనిలో పనిచేస్తున్న కార్మికులు (ఫైల్)

బెల్లంపల్లి రీజియన్‌పైనే దృష్టి

బెల్లంపల్లి రీజియన్‌పైనే ప్రస్తుతం సంస్థ దృష్టి పెట్టింది. బుధవారం సీసీసీ సింగరేణి విశ్రాంత భవనంలో జరిగిన జీఎంల సమావేశంలో డైరెక్టర్ ఆపరేషన్స్ ఎస్.చంద్రశేఖర్, డైరెక్టర్ ప్రాజెక్ట్స్ అండ్ ప్లానింగ్ భాస్కర్ రావులు ఉత్పత్తి, ఉత్పాదకత, బొగ్గు రవాణాపై సుదీర్ఘంగా చర్చించారు. బెల్లంపల్లి రీజియన్ ముఖ్యంగా బెల్లంపల్లి ఏరియా రూ.500 కోట్లకు పైగా 2016-17 ఆర్థిక సంవత్సరంలో ఆర్జించింది. ఈ సంవత్సరం కూడా అక్కడి జనరల్ మేనేజర్ రవిశంకర్ ఆధ్వర్యంలో రూ.500 కోట్లు దాటే పరిస్థితి ఉంది. శ్రీరాంపూర్‌లో జీఎం సుభాని ఆధ్వర్యలో భూగర్భ గనులు ఉత్పత్తి లక్ష్యాలను సాధించడం ఈ సంవత్సరం ప్రత్యేకంగా పేర్కొనవచ్చు. అటు మందమర్రి ఏరియాలోనూ అక్కడి జీఎం రాఘవులు నేతృత్వంలో ఉత్పత్తి ఉత్పాదకత గతం కన్నా మెరుగైందని పేర్కొనవచ్చు. డైరెక్టర్లు చంద్రశేఖర్, భాస్కర్‌రావులు బెల్లంపల్లి అటు రామగుండం రీజియన్‌లపై కేంద్రీకరించి సమావేశాలు, సమీక్షలు పెడుతున్నారు. బొగ్గు గనుల్లో పర్యటించి సంబంధిత విభాగాల అధికారులకు దిశా నిర్దేశం చేస్తున్నారు.

ఆమోదానికి నోచుకోని గ్రాట్యుటీ బిల్లు

ఆంధ్రజ్యోతి, మంచిర్యాల, జనవరి3: బొగ్గుగని కార్మికుల గ్రాట్యుటీని రూ.10 లక్షల నుంచి రూ.20 లక్షలకు పెంచే బిల్లు సాంకేతిక కారణాల వల్ల పార్లమెంటులో ఇంకా ఆమోదించలేదు. దీనికి మరికొంత సమయం పట్టే పరిస్థితి ఉంది. రూ.20 లక్షలకే సీలింగ్ అనేది కూడా ఇంకా స్పష్టంగా తేలని విషయమని సీఐటీయూ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి నాగరాజుగోపాల్ ఆంధ్రజ్యోతితో పేర్కొన్నారు. పార్లమెంట్‌లో బిల్లు ఆమోదం అనంతరం అమలుకు సంబంధించిన ప్రక్రియ ప్రారంభమవుతుంది. సింగరేణిలో పదో వేతన ఒప్పందం పరిధిలోకి వచ్చిన 3 వేల మందికి పైగా రిటైర్డ్ కార్మికులు గ్రాట్యుటీ సీలింగ్ ఎత్తివేత, పెంపు బిల్లు కోసం ఎదురుచూస్తున్నారు.

మెడికల్ బోర్డును తక్షణమే పునరుద్ధరించాలి

హెచ్‌ఎంఎస్ ప్రధాన కార్యదర్శి రియాజ్ అహ్మద్

గోదావరిఖని, జనవరి3: సింగరేణి యాజమాన్యం తక్షణమే మెడికల్ బోర్డును పునరుద్ధరించి దరఖాస్తు చేసుకున్న కార్మికులందరిని అన్‌ఫిట్ చేయాలని హెచ్‌ఎంఎస్ ప్రధాన కార్యదర్శి రియాజ్ అహ్మద్ డిమాండ్ చేశారు. బధవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏళ్లుగా మెడికల్‌బోర్డు రద్దు కావడంతో 756 కార్మిక కుటుంబాలు రోడ్డున పడ్డాయన్నారు. అన్‌ఫిట్ చేసినప్పటికీ వేతనాలు ఇవ్వడం లేదని ఆయన వాపోయారు. మైన్స్ రూల్స్ ప్రకారం ఆరోగ్యంగా ఉన్న కార్మికులు మాత్రమే భూగర్భ గనుల్లో పని చేయాలని, అన్‌ఫిట్ చేసిన వారికి సగం వేతనం ఇవ్వకపోవడం వల్ల ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఇప్పటికైనా యాజమాన్యం వైఖరి మార్చుకొని వెంటనే మెడికల్ బోర్డు పునరుద్ధరించాలని లేని పక్షంలో ఉద్యమం తప్పదని రియాజ్ హెచ్చరించారు. సింగరేణిలో కార్మిక సంఘాలను నిర్వీర్యం చేసిన ఘనత సంస్థ సీఎండీకే దక్కుతుందని ఎద్దేవా చేశారు. సీఎండీ కార్యాలయం పూర్తిగా లంచాలమయం అయ్యిందని ఆరోపించారు. అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని, డైరెక్టర్లు పొంతనలేని ప్రకటనలు చేస్తూ కార్మికులను తప్పుదోవ పట్టిస్తున్నారని రియాజ్ ఆరోపించారు. సరైన గుర్తింపు సంఘం లేకపోవడం వల్ల అధికారులు ఆడిందే ఆటగా మారిందన్నారు. ఎన్నికలకు ముందు చేసిన కార్మిక సంఘాల నాయకుల బదిలీలను బేషరతుగా ఉపసంహరించుకోవాలని రియాజ్ డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు యాదగిరి సత్తయ్య, తాటి రాజయ్య, సుదర్శన్, సాంబయ్య, రాజన్న, కే సమ్మయ్య పాల్గొన్నారు.

కోల్‌ఇండియా చైర్మన్లుగా సింగరేణి బాస్‌లు

గతంలో నర్సింగరావు, సుతీర్థ భట్టాచార్య సేవలు • ప్రస్తుతం బరిలో నడిమెట్ల శ్రీధర్

గోదావరిఖని, జనవరి3: కోల్ ఇండియా చైర్మన్‌గా వరుసగా సింగరేణి సీఎండీలే ఎంపికవుతున్న రికార్డు ఉంది. ప్రస్తుతం రాష్ట్ర ముఖ్యమంత్రి కార్యాలయ ప్రత్యేక కార్యదర్శిగా పనిచేస్తున్న రిటైర్డ్ ఐఏఎస్ నర్సింగరావు సింగరేణి సీఎండీగా పనిచేసి 2012లో కోల్ ఇండియా చైర్మన్‌గా వెళ్లారు. నర్సింగరావు కోల్ ఇండియా చైర్మన్‌గా వెళ్లిన సందర్భంలో సింగరేణి సీఎండీగా నియమితులైన ఐఏఎస్ అధికారి సుతీర్థ భట్టాచార్య 2015లో కోల్‌ఇండియా చైర్మన్‌గా ఎంపికయ్యారు. సుతీర్థ భట్టాచార్య రిటైర్ అయిన అనంతరం కోల్ ఇండియా చైర్మన్ పదవి ఖాళీగా ఉంది. దాని కోసం జరుగుతున్న ఇంటర్వ్యూల్లో తిరిగి సింగరేణి ప్రస్తుత సీఎండీ శ్రీధర్‌కు అవకాశం కలిగే పరిణామాలు కనిపిస్తున్నాయి. శ్రీధర్ కోల్‌ఇండియాకు ఎంపికైతే వరుసగా సింగరేణి సీఎండీలే మూడుసార్లు కోల్‌ఇండియా చైర్మన్‌గా పనిచేసిన రికార్డు సొంతమవుతుంది.

భారత బొగ్గు పరిశ్రమల చైర్మన్‌గా సింగరేణి సీఎండీ నడిమెట్ల శ్రీధర్‌కు అవకాశాలు మెరుగుపడుతున్నాయి. తెలంగాణ ప్రభుత్వం కూడా శ్రీధర్‌ను ప్రతిపాదిస్తూ ఈ మధ్యే కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాసింది. దీంతో కోల్‌ఇండియా చైర్మన్‌గా శ్రీధర్ ఎంపికయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. రెండున్నర సంవత్సరాలుగా సింగరేణిలో సీఎండీ మంచి పనితీరును కనబరిచిన రికార్డు ఉంది. శ్రీధర్ బాధ్యతలు తీసుకున్నప్పటి నుంచి సింగరేణి ఉత్పత్తి 15శాతం పెరిగిన గణాంకాలు కూడా ఈ పోటీలో శ్రీధర్‌కు ఉపయోగపడనున్నాయి. 2017మార్చి వరకే శ్రీధర్ సింగరేణి సీఎండీగా పనిచేయాల్సి ఉన్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం ఆయన పనితీరుపై సంతృప్తి చెంది ఇంకా కొనసాగిస్తున్నది. కోల్‌ఇండియా చైర్మన్‌గా ఉన్న సుతీర్థ భట్టాచార్య ఐదు మాసాల క్రితం పదవీ విరమణ చేశారు. అప్పటి నుంచి కోల్‌ఇండియా చైర్మన్ కోసం కేంద్ర ఇంధనశాఖ రెండు సార్లు దరఖాస్తులను ఆహ్వానించింది. 50ఏళ్ల వయసు దాటి ఐఏఎస్ అయిన అధికారులను మాత్రమే అర్హులుగా ప్రకటిస్తూ తొలుత నోటిఫికేషన్ జారీ చేసింది. అయితే ఈ క్యాటగిరిలో కోల్‌ఇండియా లాంటి భారీ సంస్థను ముందుకు తీసుకుపోయేందుకే ఐఏఎస్‌లు ఆసక్తి కనబర్చక పోవడంతో రెండు మాసాలు వాయిదా పడింది. వయసును 45 ఏళ్లకే కుదిస్తూ మళ్లీ నోటిఫికేషన్ జారీ అయ్యింది. దీంతో సింగరేణి సీఎండీ శ్రీధర్‌కు కోల్‌ఇండియా చైర్మన్ పదవికి దరఖాస్తు చేసుకునే అవకాశం వచ్చింది. శ్రీధర్ దరఖాస్తును కూడా తెలంగాణ ప్రభుత్వం ఆమోదిస్తూ ప్రతిపాదించింది.



నర్సింగరావు



సుతీర్థభట్టాచార్య



నడిమెట్ల శ్రీధర్

భారత బొగ్గు పరిశ్రమలో అతిపెద్ద కంపెనీ సింగరేణి కావడం, విస్తరణ, లాభాలు, ఉత్పత్తి, ఉత్పాదకత అంశాల్లో నెంబర్‌వన్‌గా ఉంది. ఈ సంస్థకు సమర్థవంతమైన సీఎండీగా శ్రీధర్ పనిచేస్తున్నాడు. ఈ ట్రాక్‌రికార్డు కోల్ ఇండియా చైర్మన్‌గా శ్రీధర్ నియామకానికి దోహదపడే అవకాశా లున్నాయి. శ్రీధర్ పదవీ కాలంలోనే సింగరేణి నైని బ్లాక్ తీసుకుని అంతర్రాష్ట్ర సంస్థగా ఎదగడం, అంతర్జాతీయంగా కూడా బొగ్గు బ్లాక్‌లు తీసుకునేందుకు ప్రయత్నించడం లాంటి అంశాలు కూడా ఆయనకు కలిసి వచ్చే అవకాశం ఉంది.

బిట్స్

డైరెక్టర్ సీహెచ్‌పీ సందర్శన



రైల్వేలైన్‌ను పరిశీలిస్తున్న డైరెక్టర్

యైటింక్లయిన్‌కాలనీ, జనవరి 3: ఆర్జీ-2 పరిధిలోని ఓసీపీ-3 సీహెచ్‌పీని బుధవారం సంస్థ డైరెక్టర్ (ఈ అండ్‌ఎమ్) శంకర్ సందర్శించారు. సీహెచ్‌పీ నుంచి బొగ్గురవాణా తీరును పరిశీలించారు. ఉత్పత్తి చేస్తున్న బొగ్గును ఎప్పటికప్పుడు రవాణా చేసేలా ప్రణాళికాబద్ధంగా పనిచేయాలని సూచించారు. డైరెక్టర్ వెంట జీఎం విజయబాబు, సీహెచ్‌పీ ఇంచార్జి సదానందం, ఎస్‌ఎస్‌ఓ జానకిరామారావులు ఉన్నారు.

'కార్మికుల సమస్యల సాధనకు పోరాటం'

మందమర్రి, జనవరి3: సింగరేణిలో కార్మికులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యల సాధన కోసం పోరాటం ఒక్కటే మార్గమని ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి సలెంద్ర సత్యనారాయణ, సహాయ కార్యదర్శి బీ సుధర్శన్‌లు పేర్కొన్నారు. బుధవారం ఏఐటీయూసీ కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడుతూ సింగరేణిలో కార్మిక గుర్తింపు సంఘంఎన్నికలు జరిగి మూడు నెలలు కావస్తున్న గుర్తింపు పత్రం అందక పోవడం సోచనీయమన్నారు. దీని వల్ల కార్మికులు సమస్యలతోనే సహవాసం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గుర్తింపు పత్రాలు ఇవ్వడానికి ఇంత జాప్యం ఎందుకో అర్థం కావడం లేదన్నారు. తమ సంఘాన్ని గెలిపిస్తే కారుణ్య నియామకాలు అమలు చేస్తామని, సొంత ఇంటి కళ నెరవేరుస్తామని, అనేక హామీలు ఇచ్చిన ముఖ్యమంత్రి వాటి అమలుకు చొరవ చూపడం లేదన్నారు. సింగరేణిలో పెద్దఎత్తున కార్మికులు ప్రతి నెల ఉద్యోగ విరమణ చేస్తునే ఉన్నారని, కారుణ్య నియామకాల కోసం కళ్లల్లో వత్తులు వేసుకొని ఎదురు చూస్తున్నారని ధ్వజమెత్తారు. ఈ హామీల అమలు కోసం అటు ప్రభుత్వం, యాజమాన్యం పై ఒత్తిడి తీసుకొస్తామన్నారు. దీనిలో భాగంగా ఏరియాలో అన్ని డిపార్ట్‌మెంటుల గనులకు సంబంధించి కమిటీలు ఎంపిక చేశామని తెలిపారు. ఈ సమావేశంలో నాయకులు శ్రీనివాస్, జీ ఎల్లయ్య, అంకతి సాయిలు, రవీందర్, కిష్టయ్య, తదితరులు పాల్గొన్నారు.

సివిల్ డిపార్ట్‌మెంట్ కమిటీ ఎన్నిక

మందమర్రి ఏరియా సివిల్ డిపార్ట్‌మెంట్ ఏఐటీయూసీ పిట్ కమిటీని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికైనటువంటి కమిటీని బ్రాంచ్ కార్యదర్శి సలెంద్ర సత్యనారాయణ ప్రకటించారు. ఫిట్‌సెక్రటరిగా గట్టు జగన్, వైస్ ప్రెసిడెంట్‌గా చారి, సహాయ కార్యదర్శిగా శంకర్, కోశాధికారిగా వెంకటేశ్వర్లు, ప్రచార కార్యదర్శులుగా కొమురారెడ్డి, కొమురయ్య, లింగమూర్తి, నర్సయ్య, లక్ష్మణ్‌లను ఎంపిక చేశారు. ఈ కమిటీని సత్యనారాయణ ఆధ్వర్యంలో ఎంపిక చేసినట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

- ఆటోను ఢీకొట్టిన బైక్
- ముగ్గురికి గాయాలు

కాసిపేట, జనవరి 3: మంచిర్యాల, బెల్లంపల్లి రాష్ట్రీయ రహదారి సుబ్బరావుపల్లె సమీపంలో ఆటో, బైక్ ఢీకొనడంతో ఓ మహిళ మృతిచెందింది. ఈ ప్రమాదంలో మరో ముగ్గురికి తీవ్రమైన గాయాలయ్యాయి. అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొంది ఇంటికి తిరిగి వెళ్తున్న సమయంలో వెంటాడిన మృత్యువు రోడ్డు ప్రమాదంలో ఆ మహిళను కాటేసి ఆ కుటుంబంలో తీవ్ర విషాదాన్ని నింపింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన గోమాస అనిత(24) ప్రమాదంలో మృతి చెందగా భర్త దేవాజి, మూడేళ్ల కూతురు సరిత తీవ్ర గాయాలపాలయ్యారు. ఏడు సంవత్సరాల క్రితం మహబూబాబా ద్‌కు చెందిన గోమాస అనిత కన్నెపల్లికి చెందిన ఆటోడ్రైవర్ దేవాజిని ప్రేమ వివాహం చేసుకుంది. వీరికి ముగ్గురు కుమార్తెలు. మంచిర్యాల ఆసుపత్రిలో చికిత్స చేయించుకున్న తర్వాత గోమాస అనిత, భర్త దేవాజి, చిన్న కూతురు సరితతో వారి సొంత ఆటోలో తిరిగి ఇంటికి వెళ్తున్నారు. ఈ క్రమంలో మంచిర్యాలకు చెందిన ఎండీ రియాజ్ బైక్‌పై అతి వేగంగా వచ్చి ఆటోను వెనుక నుంచి ఢీకొట్టాడు. ఈ ఘటనలో ఆటో నుంచి కింద పడిన అనిత అక్కడికక్కడే మృతి చెందగా, దేవాజికి కాలు విరిగింది. మూడేళ్ల పాప సరితకు గాయాలయ్యాయి. బైక్ నడుపుతున్న రియాజ్‌కు స్వల్పగాయాలయ్యాయి. అతివేగంగా, అజాగ్రత్తగా బైక్ నడిపి ప్రమాదానికి కారణమైన ఎండీ రియాజ్‌పై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సతీష్ తెలిపారు.



గాయపడిన దేవాజి, ఆటోపైకి దూసుకెళ్లిన బైక్

నేటి నుంచి అథ్లెటిక్స్ పోటీలు

- ముస్తాబైన ఠాగూర్ స్టేడియం
- 600 మంది క్రీడాకారుల రాక



రామకృష్ణాపూర్‌లో ఏర్పాట్లు చేపడుతున్న నిర్వాహకులు

రామకృష్ణాపూర్: మాస్టర్స్ అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్వర్యంలో గురువారం నుంచి వెటరన్ అథ్లెటిక్ పోటీలు నిర్వహించనున్నారు. ఈ పోటీల కోసం రామకృష్ణాపూర్ ఠాగూర్ స్టేడియం ముస్తాబైంది. గురు, శుక్రవారాల్లో నిర్వహించనున్న ఈ పోటీల్లో పాల్గొనేందుకు రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 600 మంది కి పైగా వెటరన్ క్రీడాకారులు పట్టణానికి చేరుకున్నారు క్రీడా నిర్వాహకులు పురుషులకు, స్త్రీలకు వేరువేరుగా పోటీలను నిర్వహించనున్నారు. క్రీడా విభాగాలలో 100 మీటర్ల, 200 మీటర్లు, 400మీటర్లు, 800 మీటర్లు పరుగు పందాలతో పాటు 5కీమీలతో పాటు 10కీమీ పరుగు పందాలు, జావేలిన్ త్రో, లాంగ్ జంపు, హై జంపు, తదితర అంశాలతో ఈ పోటీలు నిర్వహించనున్నారు. రాష్ట్ర నలుమూల నుంచి క్రీడాకారులు పెద్ద ఎత్తున తరలిరావడంతో పట్టణంలో రెండు రోజుల పాటు క్రీడా సంబరం నెలకొననుంది. క్రీడాకారుల వసతి కోసం సింగరేణి యాజమాన్యం రామకృష్ణాపూర్ సింగరేణి పాఠశాల, రెస్క్యూ స్టేషన్, కమ్యూనిటి హల్, జీటి హస్టల్‌లో ఏర్పాట్లు చేశారు. చాల రోజుల తరువాత రామకృష్ణాపూర్‌లో క్రీడా పోటీలు నిర్వహించడంతో నిర్వాహకులు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేపట్టారు.

పోటీలను ప్రారంభించనున్న విప్, ఎమ్మెల్సీ..

పట్టణంలోని ఠాగూర్ స్టేడియంలో నిర్వహించనున్న మాస్టర్స్ అథ్లెటిక్ పోటీలకు ముఖ్య అతిథులుగా ప్రభుత్వ విప్ నల్లాల ఓదెలు, ఎమ్మెల్సీ పురాణం సతీష్, మంచిర్యాల కలెక్టర్ ఆర్వీకర్ణన్ హజరు కానున్న ట్లు పోటీల నిర్వహకులు కంబగోని సుదర్శన్ గౌడ్, గాండ్ల సమ్మయ్య బుధవారం పేర్కొన్నారు. ప్రతిష్ఠాత్మకంగా ఈ పోటీలు నిర్వహిస్తున్నామని, క్రీడాకారులకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా ముందస్తు ఏర్పాటు చేసినట్లు వారు తెలిపారు.

గుట్కా పట్టివేత

శ్రీరాంపూర్, జనవరి 3: శ్రీరాంపూర్‌లోని జాతీయ రహదారి 63పై బుధవారం సాయంత్రం ఎస్సై రవిప్రసాద్ ఆధ్వర్యంలో వాహనాలు తనిఖీ చేస్తుండగా రూ. లక్ష విలువ గల గుట్కా, అంబార్ ప్యాకెట్లను పట్టుకొని ఇద్దరు నిందితులను అరెస్టు చేశామని జైపూర్ ఏసీపీ సీతారాములు తెలిపారు. బుధవారం సాయంత్రం ఆయన పోలీస్‌స్టేషన్‌లో నిందితులను అరెస్టు చూపిస్తూ వివరాలను వెల్లడించారు. మంచిర్యాల - చెన్నూర్ ప్రధాన రహదారిపై ఎస్సై రవిప్రసాద్ వాహనాలు తనిఖీ చేస్తుండగా అనుమానస్పదంగా వస్తున్న రెండు మోటర్ సైకిల్‌లపై సంచులను చూసి ఆపి తనిఖీ చేసినట్లు తెలిపారు. సంచులను తెరిచి చూడగా రూ. లక్ష విలువ గల గుట్కా, అంబార్ ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. గౌతమి నగర్ మంచిర్యాలకు చెందిన వినిశెట్టి వెంకటేష్, రాళ్లపేటకు చెందిన షేక్ అఫ్జల్‌లను అరెస్టు చేసి రెండు బైక్‌లను స్వాధీనపర్చుకున్నట్లు తెలిపారు.

గూడెం సత్యదేవుడి ఆలయ అభివృద్ధికి కృషి

దండేపల్లి జనవరి 3: తెలంగాణ ప్రాంతంలో మరో అన్నవరంగా ప్రఖ్యాతిగాంచిన గూడెం శ్రీసత్యనారాయణస్వామి దేవాలయ అభివృద్ధికి కృషి చేసి రాష్ట్రంలో గొప్ప పుణ్యక్షేత్రంగా తీర్చిదిద్దడానికి కృషి చేస్తామని ఆలయ ఛైర్మన్ గోవర్ధన వెంటకస్వామి, ఆలయ కార్యనిర్వహణాధికారి టి నారాయణ చెప్పారు. బుధవారం మండలంలోని గూడెం శ్రీసత్యనారాయణస్వామి దేవాలయంలో ఆలయ ఛైర్మన్ వెంకటస్వామి అధ్యక్షతన ఆలయ కమిటీ సభ్యులతో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాలయంకు స్వామి దర్శనం కోసం వచ్చే భక్తుల కోసం ఆలయంలో విక్రయించే లడ్డు ప్రసాదలను నెయ్యితో కూడిన రుచికరంగ తయారు చేయాలని కమిటీ సభ్యులు తీర్మానించారు. దేవాలయానికి సంబంధించిన 3 నెలల ఆదాయ వ్యయాలను ఆలయ ఈవో నారాయణ ఆలయ కమిటీ సభ్యులకు చదివి వినిపించారు. దేవాలయ అభివృద్ధి, ఆలయంలో కావాల్సి సౌకర్యాలపై చర్చించారు. ఉన్నత అధికారుల నుంచి అనుమతి రాగానే వీటిన్నింటిన్ని అమలు చేస్తామని ఆలయ ఈవో నారాయణ వెల్లడించారు. పలు అంశాలపై చర్చించారు. సమావేశంలో ఆలయ కమిటి సభ్యులు కొండు సత్తయ్య, కొండా చంద్రశేఖర్, సాయిని సుధాకర్, జాడి రమేష్, ఆకుల తిరుపతి, కనగంటి తిరుపతి, గుర్రాల రాజిరెడ్డి, మారశెట్టి సత్తవ్వ, గట్టు మురళీధర్, మేడి నారాయణ, గదాసు బాపు, ఆలయ అధికారులు రమణారావు, సత్యనారాయణ, అంజన్న, తిరుపతి, ఆలయ ప్రధాన అర్చకుల గోవర్ధన రఘుస్వామి, ఆలయ సిబ్బంది, అర్చకులు తదితరులు ఉన్నారు.

గూడెం శ్రీరమా సహిత సత్యనారాయణస్వామి ప్రధానాలయం పక్కా స్వామివారి నూతన వ్రత మండపం, వెయిటింగ్ హాల్ నిర్మాణాలకు సర్వశ్రేయోనిధి(సీజీఎఫ్)ద్వారా రూ. 26లక్షల నిధులు, అన్నదానసత్రం పెద్ద కోసం మరో రూ. 12లక్షల నిధులు మంజూరు అయ్యన్నట్లు దేవస్థానం కార్యనిర్వహణాధికారి టి నారాయణ, ఆలయ ఛైర్మన్ గోవర్ధన వెంకటస్వామిలు తెలిపారు. దేవాదాయ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి, మంచిర్యాల ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావు దృష్టి తీసుకెళ్లగా ఈ నిధులు మంజూరు చేయించారని వారు వెల్లడించారు.



సమీక్ష నిర్వహిస్తున్న కమిటీ సభ్యులు

టైగర్ జోన్‌లోకి వెళ్లాలంటే బాదుడే

జన్నారం, జనవరి 3: కవ్వాల టైగర్‌జోన్‌లోని ముఖ్య ద్వారాలైన తాళ్లపేట, కలమడుగు, ఆదిలాబాద్ జిల్లాలోని కొత్తగూడెం, నిర్మల్ జిల్లాలోని పాండ్వాపూర్ చెక్‌పోస్టుల గుండా టైగర్‌జోన్‌లోకి అడుగుపెట్టే వాహనాలపై అటవీశాఖ బాదుడు మొదలు పెట్టింది. చిన్న వాహనాలకు రూ. 20, పెద్ద వాహనాలకు రూ. 50 చొప్పున కొత్త సంవత్సరం నుంచి తీసుకోవడానికి నిర్ణయించింది. అసలే కవ్వాల టైగర్‌జోన్‌లో ఉండే ప్రజల పరిస్థితి అంతతమాత్రం. టైగర్‌జోన్‌లోకి భారీ వాహనాలు అనుమతించకపోవడంతో జన్నారం మండలం అభివృద్ధికి నోచుకోవడం లేదని ఇప్పటికే ప్రజలు అంటున్నారు. రవాణా పరంగా ఇబ్బందులు ఉండడంతో భారీ వాహనాలు రాక ఇందన్‌పల్లి, జన్నారం హోటళ్లు మూసుకునే పరిస్థితి నెలకొంది. దీనికి తోడు జనవరి 1 నుంచి నాలుగు చక్రాల వాహనానికి రూ. 20, ఆరు చక్రాలకు పైగా వాహనాలకు రూ. 50 చొప్పున బాదడంతో బయట నుంచి వచ్చే వాహనదారులు అటు నుంచి అటే వెళ్లే పరిస్థితి దాపురించింది. స్థానిక వాహనదారులకు మాత్రం వెసులుబాటు కల్పిస్తున్నామని అటవీశాక అధికారులు చెబుతున్నారు. రాత్రి 9 దాటితే వాహనాలు లోనికి అనుమతి లేదు. దీనికి తోడు భారీ వాహనాలకు అనుమతి లేదు. ఇప్పుడు ఈ రుసుము పెట్టడంతో జన్నారం మండలం వైపు రావాలంటే వాహనదారులు భయపడే పరిస్థితి నెలకొంది.

[redacted] సంక్షిప్తంగా

కోడి పందాలు నిర్వహిస్తున్న ఆరుగురి అరెస్టు

బెజ్జూరు, జనవరి 3: మండలంలోని ముంజంపల్లి సమీపంలో కోడి పందాలు నిర్వహిస్తున్న ఆరుగురిని అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు ఎస్సై శివప్రసాద్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ కోడి పందాలు ఆడుతున్నారనే సమాచారంతో బుధవారం దాడులు నిర్వహించగా గ్రామానికి చెందిన గర్లె పోచం, దుబ్బుల రమేష్, శంకర్, చాప్లె పురుషోత్తం, దూస వెంకటేష్, గణపతి పట్టుబడ్డారని చెప్పారు. వారి వద్ద నుంచి రూ.2400, రెండు కోడి పుంజులను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ మేరకు వారిపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో ఒకరికి జైలు

భీమారం, జనవరి 3: మద్యం తాగి లారీ నడుపుతూ పట్టుబడిన వ్యక్తికి మూడు రోజుల జైలుశిక్ష పడినట్లు ఎస్సై రాజిరెడ్డి తెలిపారు. సోమవారం వాహనాల తనిఖీ నిర్వహించగా లారీ డ్రైవర్ అప్పాసు రాజయ్య మద్యం తాగి పట్టుబడగా, చెన్నూర్ సివిల్‌కోర్టులో హాజరు పరిచారు. అప్పాసు రాజయ్యకు మూడు రోజుల జైలు శిక్ష విధిస్తూ జడ్జి ఉదయ్ భాస్కర్ తీర్పునిచ్చారని ఎస్సై తెలిపారు.

శతాధిక వృద్ధురాలి మృతి

కోటపల్లి, జనవరి3: మండలంలోని సిరుసా గ్రామానికి చెందిన శతాధిక వృద్ధురాలు బొమ్మ అమ్మక్క (105) మంగళవారం రాత్రి మృతి చెందింది. ఆమె భర్త రాజిరెడ్డి 20 సంవత్సరాల క్రితమే చనిపోయాడు. ఆమెకు ఇద్దరు కుమారులు ఉన్నారు. 105 సంవత్సరాల వయస్సులోనూ ఈ వృద్ధురాలు తన పనులు తానే చేసుకుంటూ ఎవరిపై ఆధారపడకుండా జీవించింది.

వన్యప్రాణుల వేటగాడి అరెస్టు



వేటగాడితో అటవీశాఖ అధికారులు

వెన్నెల, జనవరి 3: కరెంటు తీగలు అమర్చి వన్యప్రాణులను వేటాడుతున్న వ్యక్తిని అటవీశాఖ అధికారులు బుధవారం ఉదయం అరెస్టు చేశారు. రంగపేట సెక్షన్ పరిధిలోని బొప్పారం శివారు అటవీ ప్రాంతంలో వేట సాగిస్తున్న బెల్లంపల్లి మండలం దుగ్నెపల్లికి చెందిన సల్లూరి నానయ్యను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నట్లు కుశ్నపల్లి ఎఫ్ఆర్‌వో అప్పలకొండ తెలిపారు. పక్కా సమాచారంతో మాటు వేసి నానయ్యను పట్టుకున్నామన్నారు. అతడి నుంచి కరెంటు తీగలు స్వాధీనం చేసుకుని అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. వన్యప్రాణుల వేటగాళ్లను ఉపేక్షించేది లేదని కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ దాడిలో ఎఫ్ఆర్‌వోతో పాటు డిప్యూటీ రేంజర్ రమాదేవి, సిబ్బంది ఉన్నారు.

అంధులకూ ఉందో లిపి..

సప్త వర్ణాలు ఎలా ఉంటాయో వారికి తెలియదు.. కానీ కోపంతో ఉంటే ఎరుపు వర్ణం, శాంతంగా ఉంటే తెలుపు వర్ణం అని వారికి తెలుసు. అందరూ కళ్లతో చూస్తే వారు మాత్రం మనసుతో చూస్తారు. అదే వారి మనోనేత్రం. అమావాస్య చీకటిలాంటి అంధకారంలో మగ్గుతున్న అంధుల జీవితాల్లో పున్నమి వెలుగులు పూయించిన మహనీయుడు లూయిస్ బ్రెయిలీ. చూపు లేని వారి కోసం ప్రత్యేక లిపి తయారు చేసి, వారి జ్ఞానసముపార్జన బాటలు వేసిన ఆయన జయంతి సందర్భంగా ప్రత్యేక కథనం..

◆ మంచిర్యాల అర్బన్


బ్రెయిలీ లిపి ద్వారా చదువు నేర్చుకుంటున్న అంధులు

నేడు లూయిస్ బ్రెయిలీ జయంతి

● అంధుల ఆరాధ్య దైవం..

అంధుల ఆరాధ్య దైవం లూయిస్ బ్రెయిలీ 1809 జనవరి 4న ఫ్రాన్స్ రాజధాని పారిస్ సమీపంలోని కూవ్రే అనే గ్రామంలో మానిక్యూ బ్రెయిలీ, సైమన్ రెనే బ్రెయిలీ దంపతులకు జన్మించారు. తండ్రి గుర్రపుశాలలో పని చేస్తూ, వాటికి అవసరమయ్యే తోలువస్తువులను తయారు చేసేవారు. లూయిస్ తన మూడేళ్ల వయస్సులో తండ్రి వెంట వెళ్లి, ఆయన లేని సమయంలో పని ముట్లతో ఆడుతుండగా, కంటికి గాయమైంది. తర్వాత గాయమైన కంటికి వ్యాధి సోకి, రెండు కళ్లకూ వ్యాపించి పూర్తిగా అంధుడయ్యారు. అక్షరాలు చదవలేని లూయిస్‌ను తండ్రి పారిస్‌లోని 'నేషనల్ ఇనిస్టిట్యూట్ ఫర్ బ్లైండ్ యూత్' పాఠశాలలో చేర్పించారు. చార్లెస్ బార్బియర్ అనే సైనిక ఉద్యోగి నిరక్షరాస్యులైన సైనికులకు సందేశాలు చేరవేసేందుకు రూపొందించిన సిరాచుక్కల అక్షరాల పద్ధతిని వీరి పాఠశాలలో ప్రవేశపెట్టారు. బార్బియర్ తయారు చేసిన లిపి ఆధారంగా ఆరు చుక్కలతో


లూయిస్ బ్రెయిలీ

కూడిన లిపిని అంధులకు అనుకూలంగా బ్రెయిలీ తయారు చేశాడు. ఈ అక్షర క్రమం వ గా వ ఁ ా లు అచ్చులో కాకుండా చేతి స్పర్శ ద్వారా తెలుసుకోగలిగేలా ఉంటుంది. చుక్కల రూపంలో ఉన్న ఈ బ్రెయిలీ లిపి కొద్ది రోజుల్లోనే ప్రపంచ వ్యాప్తంగా ప్రాచుర్యం పొందింది. లూయిస్ బ్రెయిలీ తన 20వ ఏట చదువుకున్న పాఠశాలలోనే ఉపాధ్యాయునిగా వృత్తి జీవితం ప్రారంభించారు. అనంతరకాలంలో క్షయవ్యాధి బారిన పడిన బ్రెయిలీ 1852 జనవరి 6న మరణించారు.

● జిల్లాలో 500కు పైగా అంధులు..

మంచిర్యాల జిల్లాలో 500 మందికి పైగా అంధులున్నారు. వీరికి ప్రభుత్వం తరుపున ఎలాంటి ప్రత్యేక పాఠశాలలు లేవు. మంచిర్యాల పట్టణంలో ఓ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఏడేళ్లుగా 'సాయి అంధుల పాఠశాల' కొనసాగుతున్నది. దాతల సహాయంతో నిర్వహిస్తున్న ఈ పాఠశాలలో ప్రస్తుతం 25 మంది అంధ విద్యార్థులు ఉచిత విద్య, వసతి పొందుతున్నారు. చదువుతోపాటు సంగీతం, నృత్యం, వాయిద్యం, మెగా మెడిటేషన్, కరాటే, అబాకస్, కంప్యూటర్‌తో పాటు వివిధ ఆటల్లో శిక్షణ ఇస్తున్నారు.

● సత్తాచాటుతున్న విద్యార్థులు

ఇక్కడి అంధ విద్యార్థులు వివిధ రాష్ట్ర, జాతీయస్థాయి సాంస్కృతిక పోటీల్లో సత్తా చాటుతున్నారు. ఇప్పటివరకు వివిధ సంగీత, నృత్యపోటీల్లో అనేక అవార్డులు గెలుచుకున్నారు. డిసెంబర్24న వరంగల్‌లో జరిగిన శాస్త్రీయ నృత్య పోటీల్లో ప్రథమ బహుమతి గెలుచుకోవడమేగాక 'తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్', 'తెలంగాణ బుక్ ఆఫ్ రికార్డ్స్'లో చోటు సంపాదించారు.


తెలంగాణ బుక్ ఆఫ్ రికార్డు సాధించిన అంధుల పాఠశాల విద్యార్థులు



స్పర్శద్వారానే చదువు..

-శిరీష. పిప్పల్‌పోటీ, ఆదిలాబాద్ జిల్లా

లూయిస్ బ్రెయిలీ మా ఆరాధ్య దైవం. ఆయన రూపొందించిన లిపి ఆధారంగా కేవలం స్పర్శ జ్ఞానంతో చదవగలుగుతున్నాం. కంటి చూపు లేకున్నా బాధలేదు. మేము ఎవరికీ తీసిపోం అనే సానుకూల దృక్పథంలో ముందకుపోతున్నాం. మా పాఠశాల నిర్వాహకులు మమ్మల్ని అన్నివిధాలా ప్రోత్సహిస్తున్నాం.



కళ్లు లేవనే బాధలేదు..

-రజిత, మంచిర్యాల

నాకు కళ్లు లేవని ఏనాడూ బాధపడలేదు. మా తల్లిదండ్రులు నన్ను ఇలాంటి మంచి పాఠశాలలో చేర్పించారు. అదే నాకు పదివేలు. నాకు ఎంతో ఆనందంగా ఉంది. చదివేది 3వ తరగతి అయినా 30 ఎక్కాలు చెప్పగలను. భగవద్గీత చదవగలను. డ్యాన్స్ చేయగలను. అన్నింటా ముందుంటాను.



ఉద్యోగమే లక్ష్యంగా..

-రాజేందర్, బుట్టాపూర్, నిర్మల్ జిల్లా

బ్రెయిలీ రూపొందించిన లిపిలో 6 చుక్కల సాయంతో తెలుగు, ఇంగ్లీష్ భాషలను చక్కగా నేర్చుకుంటున్నాం. అందరిలాగే మేము కూడా చదవడం, రాయడం చేస్తున్నాం. బ్రెయిలీలా బాగా చదువుకొని మంచి ఉద్యోగం సాదిస్తాను.



అంధులను ఆదుకోవడమే లక్ష్యం...

- అశోక్‌రావు, అంధుల పాఠశాల ప్రధానోపాధ్యాయులు

దైవం చిన్నచూపు చూడడంతో అంధులుగా జన్మించిన వీరిని ఆదుకోవడమే లక్ష్యంగా ముందుకెళ్తున్నాము. ఇందుకు దాతలు పెద్దమనసుతో సహకరిస్తున్నారు. వారందరికీ నా కృతజ్ఞతలు. ప్రభుత్వం కూడా అంధ విద్యార్థులపై దృష్టి సారించాలి. వీరి కోసం ప్రతి జిల్లాలో తప్పనిసరిగా ఒక పాఠశాల ఏర్పాటు చేయాలి.

కోట్లు పెట్టి కొన్నా.. ఫలితం సున్నా!

ఉట్నూర్ ఐటీడీఏ ఆధ్వర్యంలో పూర్వ ఆదిలాబాద్ జిల్లా పరిధిలోని 45 ఆశ్రమ పాఠశాలల్లో ఏర్పాటు చేసిన సోలార్ వాటర్ హీటర్లు నిరుపయోగంగా మారాయి. సమగ్ర కార్యచరణ పథకం(ఐఏపీ) కింద రూ.1.45 కోట్లు వెచ్చించి కొనుగోలు చేసిన పరికరాలు కొన్నిరోజులకే దెబ్బతినగా, మరమ్మతులు చేయించేవారు కరువయ్యారు. ఫలితంగా విద్యార్థులు చల్లని నీటితో వణుకుతూ స్నానాలు చేస్తున్నారు.

◆ ఉట్నూర్


గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో ఏర్పాటు చేసిన సోలార్ వాటర్ హీటర్లు

- నిరుపయోగంగా సోలార్ వాటర్ హీటర్లు
- మరమ్మతులు పట్టని అధికారులు
- వేన్నీళ్ల స్నానానికి నోచుకోని ఆశ్రమ విద్యార్థులు

పూర్వ ఆదిలాబాద్ జిల్లా పరిధిలో శీతాకాలంలో చలి తీవ్రత ఎక్కువగా ఉంటుంది. దీంతో ఆశ్రమ పాఠశాలల విద్యార్థులకు ఉదయంపూట చన్నీటి స్నానాలు చేయడం కష్టంగా ఉండేది. వణుకుతో చాలా మంది జ్వరాల బారినపడేవారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఉట్నూర్ ఐటీడీఏ ఆధ్వర్యంలో 45 ఆశ్రమ పాఠశాలల్లో సోలార్ వాటర్ హీటర్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఇందుకోసం 2016లో సమగ్ర కార్యచరణ పథకం(ఐఏపీ) కింద రూ.1.45 కోట్లు వెచ్చించి, సోలార్ వాటర్ హీటర్లు కొనుగోలుచేసి అందించింది. వీటిని వన్‌వట్, సైయాద్‌పూర్, ఝరిపూనగూడ, అందర్‌బంద్, తిర్యాణి,మానిక్యపూర్, పంగిడి మదారం, రోంపల్లి, బంబారా, జాతర్ల, పాట్నాపూర్, పార్డీ(బి), రాయిగూడ, రిమ్మ, కుంటాల, కోర్నికల్(కే), మార్లవాయి, పోచంలొద్ది, జైనూర్‌పాట్నాపూర్, అనార్‌పల్లి, కెరమెరి, రాంజీగూడ, కోహినూర్(కే), కంచన్‌పల్లి, పంగిడి, సల్గుపల్లి, ఖేతిని, ఉమ్రిగూడిహత్నూర్, ఉమ్రి(టి), ఉట్నూర్, వాంకిడి, అర్జుని, బెజ్జూర్, ఇంద్రవెల్లి, సాలేగూడ, సోమిని, స్వర్ణ, అర్జునికొలాంగూడ, పోతగూడ, సాలేగూడ, చిత్తగూడ, బాబేఝరి, గౌరి, జోడేఘాట్, లోకారి, నార్నూర్ తదితర పాఠశాలల్లో ఏర్పాటుచేశారు. కొన్నిరోజులు బాగానే పనిచేసినా తర్వాత రిపేరుకు వచ్చాయి. వాటికి మరమ్మతులు చేయించకపోవడంతో నిరుపయోగంగా మారాయి. దీంతో విద్యార్థులకు చన్నీటి స్నానాలతో ఇబ్బందులు తప్పడం లేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, సోలార్ వాటర్‌హీటర్లకు మరమ్మతులు చేయించాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కోరుతున్నారు.


నిరుపయోగంగా నీటి ట్యాంకులు

ఉన్నతాధికారులకు నివేదించాం

- రమేష్, ఈఈ ఐటీడీఏ, ఉట్నూర్



పూర్వ ఆదిలాబాద్ జిల్లా పరిధిలోని 45 గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో సోలార్ వాటర్ హీటర్లను ఏర్పాటు చేశాం. ఇవి కొన్నిచోట్ల పని చేయడం లేదని మా దృష్టికి వచ్చింది. ఈ మేరకు ఉన్నతాధికారులకు నివేదిక అందజేశాం. నిధులు మంజూరు కాగానే మరమ్మతులు చేయిస్తాం.

మేడ మీద మేటి ఎవుసం

ప్రముఖ రచయిత అల్లం రాజయ్య కలం సాగే కాదు, కూరగాయల సాగులోనూ శభాష్ అనిపించుకుంటున్నారు. కాకపోతే ఆయన వ్యవసాయం చేస్తున్నది మేడ మీద. కేవలం 300 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఇంటికి కావాల్సిన కూరగాయలు, పండ్లను పండిస్తున్నారు. అదీ పూర్తి సేంద్రియ పద్ధతిలో! నాలుగేళ్లుగా బయట నుంచి ఎలాంటి కూరగాయలూ కొనుగోలు చేయలేదని చెబుతున్నారు.

◆ ఆంధ్రజ్యోతి, మంచిర్యాల


వంకాయ మొక్కలకు నీరు పడుతున్న అల్లం రాజయ్య

- ప్రముఖ రచయిత అల్లం రాజయ్య ఆదర్శం
- నాలుగేళ్లుగా ఇంటిపై కూరగాయలు, పండ్ల సాగు
- పూర్తిగా సేంద్రియ ఎరువుల వాడకం
- ఇంటి అవసరాలు తీరడంతోపాటు మానసికోల్లాసం

● పూర్తిగా సేంద్రియ పద్ధతిలో..

ప్రస్తుతం మార్కెట్‌లో దొరుకుతున్న కూరగాయలను విచ్చలవిడి రసాయన ఎరువులు, పురుగు మందుల సాయంతో పండిస్తున్నారు. ఆరోగ్యానికి ఇవి ఏమాత్రం మంచివి కావు. వ్యవసాయ కుటుంబం నుంచి వచ్చిన రచయిత రాజయ్య, ఇందుకు ప్రత్యామ్నాయం ఆలోచించారు. తన అనుభవాన్ని రంగరించి, 'మేడ మీది ఎవుసం' మొదలుపెట్టారు. తన సొంతింటి మేడ మీద 300 చదరపు అడుగుల విస్తీర్ణాన్ని ఇందుకు ఉపయోగించుకోవాలని భావించారు. సిమెంట్ ఇటుకల సాయంతో 6/3 అడుగుల ఆరు తొట్టిలు, 4/6 అడుగుల రెండు తొట్టిలు, 3/3 అడుగుల నాలుగు తొట్టిలు ఏర్పాటుచేయించారు. కింద డాబాకు అంటకుండా నీరు ఇంకిపోయే ఏర్పాటు చేశారు. ఒండ్రు, ఎర్రమట్టిని ప్రత్యేకంగా తెప్పించి, తొట్లలో నింపారు. ఆయా తొట్లలో పూర్తిగా సేంద్రియ పద్ధతిలో కూరగాయలు, పండ్ల మొక్కలు సాగుచేస్తున్నారు. మేకలు, గొర్రెల ఎరువు, పేడ, వర్మీకంపోస్టును మాత్రమే కొద్ది మోతాదులో వాడుతున్నారు. ప్రస్తుతం ఇక్కడ బీర, సోర, కాకర, చేమగడ్డ, నాలుగు రకాల చిక్కుళ్లు, టమాట, వంకాయ, బెండ, గోబీ, పాలకూర, తోటకూర, బచ్చలి, కొత్తమీర, మెంతి, పూదీనా, ఉల్లి లాంటి కూరగాయలు, ఆకుకూరలు పండిస్తున్నారు. పలు కుండీల్లో పెట్టిన పాల సపోటా, బత్తాయి, నిమ్మ, దానిమ్మ, అంగూర, బొప్పాయి, మునగ చెట్లు కాపుకొచ్చాయి. వీటితో పాటు గులాబీ మల్లె, చామంతి, బంతి, వెదురు, పలు ఔషధ మొక్కలు, తిప్పతీగ, వివిధ రకాల అడవి మొక్కలు కనువిందుచేస్తున్నాయి. తొట్టిల ఏర్పాటు, మొక్కల కొనుగోలు కోసం ఇప్పటివరకు రూ.40వేలు ఖర్చు చేసినట్లు రాజయ్య చెప్పారు. అది మినహా ఆ తర్వాత పెద్దగా పెట్టుబడి ఏమీ ఉండదన్నారు. మొక్కలను కంటికి రెప్పలా కాపాడుకుంటున్న రాజయ్య, వాటికి నీరుపట్టడం, కూరగాయలు తెంపడంలాంటి పనులతో శరీరానికి కాస్త వ్యాయామం, మానసిక ఉల్లాసం కలుగుతున్నాయని స్పష్టం చేశారు.


తొట్టిలో బత్తాయి చెట్టు


తొట్టిలో తోటకూర


తొట్లలో పలు కూరగాయల మొక్కలు



నాలుగేళ్లుగా ఇంటి పంటే..

-అల్లం రాజయ్య

మేడ మీది ఎవుసం బాగున్నది. నాలుగేళ్లుగా స్వయంగా పండించిన కూరగాయలు, పండ్లనే వినియోగిస్తున్నాం. ఎప్పుడైనా బయట టమాట, మిర్చి తప్ప బయట నుంచి కూరగాయలు కొన్నది లేదు. మా కుటుంబానికి సరిపోగా మిగిలిన కూరగాయలను చుట్టుపక్కల వారికి పంచుతుంటాం. మొదట్లో రూ.40వేలు పెట్టుబడి పెట్టాను. ఆ తర్వాత ఎలాంటి ఖర్చు ఉండదు. మేకల, గొర్రెల ఎరువు, పేడను తక్కువ మోతాదులో వినియోగిస్తే సరిపోతుంది. రోజూ ఒక పూట నీరు పట్టాల్సి ఉంటుంది. తీగరకాల కూరగాయలు బాగా కాస్తున్నాయి. సేంద్రియ ఎరువులు మాత్రమే వాడడం వల్ల కూరగాయలు, పండ్లు చాలా తాజాగా, రుచిగా ఉంటాయి. ఇవి ఆరోగ్యానికి ఎంతో మంచివి.

ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ కల్చరల్ రిలేషన్స్ నూతన అధ్యక్షుడు?

1. 2017కి గాను పురుషుల విభాగంలో ప్రపంచ ర్యాపిడ్ చెస్ చాంపియన్‌షిప్ విజేత?
ఎ) మాగ్నస్ కార్ల్‌సన్(నార్వే)
బి) వ్లాదిమర్ ఫెడోసివ్(రష్యా)
సి) విశ్వనాథన్ ఆనంద్(ఇండియా)
డి) అలెగ్జాండర్ గ్రిషుక్(రష్యా)

2. 2017కి గాను మహిళల విభాగంలో ప్రపంచ ర్యాపిడ్ చెస్ చాంపియన్‌షిప్ విజేత?
ఎ) జువెన్‌జున్(చైనా)
బి) జుడిత్ పోల్గర్(హంగేరి)
సి) సోఫియా పోల్గర్(హంగేరి)
డి) అనా ఉషెనినా(ఉక్రెయిన్)

3. 2017కి గాను 'రాయల్‌కప్' ఏషియన్ టూర్ టైటిల్ విజేత శివకపూర్. అతడు ఏ క్రీడకు సంబంధించిన వ్యక్తి?
ఎ) షూటింగ్ బి) బిలియర్డ్స్
సి) గోల్ఫ్ డి) జిమ్నాస్టిక్స్

4. గ్లోబ్ సాకర్ అవార్డ్స్-2017 ఉత్తమ సాకర్ ఆటగాడిగా ఎవరు ఎంపికయ్యారు?
ఎ) లియోనల్ మెస్సీ బి) క్రిస్టియనా రొనాల్డో
సి) నెయ్‌మార్(బ్రెజిల్) డి) ముల్లర్(జర్మనీ)

5. ఢిల్లీపై గెలుపొంది 2017-18 రంజీ ట్రోఫీ చాంపియన్‌గా నిలిచిన జట్టు?
ఎ) ముంబై బి) గుజరాత్
సి) తమిళనాడు డి) విదర్భ



6. 61వ జాతీయ షూటింగ్ చాంపియన్‌షిప్ పోటీలకు ఆతిథ్యమిస్తున్న వేదిక?
ఎ) లుధియానా(పంజాబ్)
బి) కాన్పూర్(ఉత్తరప్రదేశ్)
సి) బెంగళూరు(కర్ణాటక)
డి) తిరువనంతపురం(కేరళ)

7. రంజీ ట్రోఫీ ఫైనల్‌లో హ్యాట్రిక్ సాధించిన రెండో బౌలర్ రజనీష్ గుర్బానీ(విదర్భ). అయితే 1972-73లో ఈ ఘనత సాధించిన తొలి బౌలర్?
ఎ) కళ్యాణ సుందరం(తమిళనాడు)
బి) ఆర్.పి.సింగ్(ఉత్తరప్రదేశ్)
సి) అర్షద్ అయూబ్(హైదరాబాద్)
డి) జవగళ్ శ్రీనాథ్(కర్ణాటక)

8. క్రికెట్ చరిత్రలో తొలిసారిగా నాలుగు రోజుల టెస్ట్ మ్యాచ్‌ను ఏ రెండు దేశాల మధ్య నిర్వహించారు?
ఎ) ఆస్ట్రేలియా - న్యూజిలాండ్
బి) దక్షిణాఫ్రికా-జింబాబ్వే
సి) దక్షిణాఫ్రికా - న్యూజిలాండ్
డి) వెస్టిండీస్ - జింబాబ్వే

9. 2018 జనవరి 12-16 వరకు 22వ జాతీయ యువజన ఉత్సవాలు ఏ నగరం వేదికగా నిర్వహించనున్నారు?
ఎ) జైపూర్(రాజస్థాన్)
బి) రాయ్‌పూర్(ఛత్తీస్‌గఢ్)
సి) కాన్పూర్(ఉత్తరప్రదేశ్)
డి) మధురై(తమిళనాడు)

10. 2017 డిసెంబర్ 27-31 వరకు జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్‌కు ఆతిథ్యం ఇచ్చిన నగరం?
ఎ) హైదరాబాద్(తెలంగాణ)
బి) గాంధీనగర్(గుజరాత్)
సి) కొచ్చి(కేరళ) డి) భువనేశ్వర్(ఒడిశా)

11. 2018 జనవరి 13-15 వరకు అంతర్జాతీయ తీపి పదార్థాల ఉత్సవాలకు ఆతిథ్యం ఇవ్వనున్న నగరం?
ఎ) కాకినాడ(ఆంధ్రప్రదేశ్)
బి) నాగ్‌పూర్(మహారాష్ట్ర)
సి) అమరావతి(ఆంధ్రప్రదేశ్)
డి) హైదరాబాద్(తెలంగాణ)

12. 78వ 'ఇండియన్ హిస్టరీ కాంగ్రెస్-2017' సదస్సును ఎక్కడ నిర్వహించారు?
ఎ) ఉస్మానియా యూనివర్సిటీ(హైదరాబాద్)
బి) జాదవ్‌పూర్ యూనివర్సిటీ(కోల్‌కతా)
సి) షేర్-ఎ-కశ్మీర్ యూనివర్సిటీ(శ్రీనగర్)
డి) బర్కతుల్లా యూనివర్సిటీ(భోపాల్)

13. 2017 డిసెంబర్ 31న బహిరంగ మలవిసర్జన రహిత రాష్ట్రంగా దేన్ని ప్రకటించారు?
ఎ) మిజోరాం బి) ఒడిశా
సి) అరుణాచల్‌ప్రదేశ్ డి) బీహార్

14. కూరగాయలకు కనీస మద్దతు ధర ప్రకటించడం ద్వారా ఆ ప్రత్యేకత పొందిన తొలిరాష్ట్రంగా నిలిచింది?
ఎ) పంజాబ్ బి) హర్యానా
సి) నాగాలాండ్ డి) బీహార్

15. ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ కల్చరల్ రిలేషన్స్‌కు నూతన అధ్యక్షుడు?
ఎ) వినయ్ సహస్రబుద్దే బి) లోకేశ్ చంద్ర
సి) ప్రతిష్ఠశర్మ డి) నజ్మాహెప్తుల్లా

16. కేంద్ర పునర్వినియోగ ఇంధన వనరుల శాఖ వివరాల ప్రకారం మునిసిపల్ వ్యర్థాల నుంచి తయారవుతున్న విద్యుత్ 65.75 మెగా వాట్స్. మొత్తం విద్యుత్‌లో ఎంత శాతం?
ఎ) 1.6% బి) 0.02% సి) 0.8% డి) 0.6%

జి.కె. అండ్ కరెంట్ అఫైర్స్

17. 2018 మార్చిలో 105వ సైన్స్ కాంగ్రెస్ సమావేశానికి ఆతిథ్యమిస్తున్నది?
ఎ) ఉస్మానియా యూనివర్సిటీ(హైదరాబాద్)
బి) మణిపూర్ యూనివర్సిటీ(ఇంఫాల్)
సి) శ్రీవేంకటేశ్వర యూనివర్సిటీ(తిరుపతి)
డి) ఫిజికల్ రీసెర్చ్ లేబొరేటరీ(అహ్మదాబాద్)

18. పాసింజర్ రైళ్లకు ఎప్పటిలోగా బయోటాయ్‌లెట్లను 100% అమర్చాలని కేంద్రం నిర్ణయించింది?
ఎ) 2018 డిసెంబర్ బి) 2019 మార్చి
సి) 2018 జూలై డి) 2022 మార్చి

19. 2017కి గాను PETA పర్సన్ ఆఫ్ ద ఇయర్'గా ఎంపికైన బాలీవుడ్ నటి అనుష్కశర్మ. PETA ను విస్తరించండి.
ఎ) పీపుల్ ఫర్ ఎథికల్ ట్రీట్‌మెంట్ ఆఫ్ యానిమల్స్
బి) ప్రొటెక్షన్ ఎంటాంజిబుల్ యానిమల్స్
సి) ప్రిజర్వేషన్ అండ్ ఎథికల్ ట్రీట్‌మెంట్ ఆఫ్ యానిమల్స్
డి) పీపుల్ ఫర్ ఎమోషనల్ ట్రాకింగ్ ఆఫ్ యానిమల్స్

20. 2018 జనవరి 12న కార్టోశాట్-2 సహా 31 ఉపగ్రహ ప్రయోగాలకు ఇస్రో ఉపయోగిస్తున్న వాహక నౌక?
ఎ) PSLV-C36 బి) PSLV-C40
సి) PSLV-C342 డి) PSLV-C39

21. 2017 డిసెంబర్ 29న నిర్మలా సీతారామన్ 'సెంటర్ ఫర్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ అపర్చునిటీస్ అండ్ లెర్నింగ్' కేంద్రాన్ని ఎక్కడ ప్రారంభించారు?
ఎ) మంగళూరు(కర్ణాటక)
బి) విశాఖపట్నం(ఆంధ్రప్రదేశ్)
సి) ట్యుటికొరిన్(తమిళనాడు)
డి) పనాజి(గోవా)

22. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 2018 సంవత్సరాన్ని ఏ విధంగా ప్రకటించింది?
ఎ) నవతేజ శిశు వికాస సంవత్సరం
బి) విద్యుదీకరణ సంవత్సరం
సి) రైతు సౌభాగ్య సంవత్సరం
డి) తెలుగు అభివృద్ధి సంవత్సరం

23. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎకనామిక్స్ 2017కు గాను వెలువరించిన 'శాంతి అనుకూల సూచి'లో తొలి మూడు స్థానాలు పొందిన దేశాలు వరుసగా ...
ఎ) స్వీడన్, స్విట్జర్లాండ్, డెన్మార్క్
బి) ఐస్‌లాండ్, నార్వే, ఫిన్లాండ్
సి) స్వీడన్, స్విట్జర్లాండ్, ఫిన్లాండ్
డి) ఫిన్లాండ్, స్వీడన్, నార్వే

24. హిమాచల్‌ప్రదేశ్ నూతన ముఖ్యమంత్రి?
ఎ) జయప్రకాశ్ నడ్డా బి) ప్రేమ్‌కుమార్ ధుమాల్
సి) జైరామ్ ఠాకూర్ డి) సత్పాల్‌సింగ్ సాధి

25. జాతీయ ఇ-గవర్నెన్స్‌లో భాగంగా చేపట్టిన క్రిమినల్ ట్రాకింగ్ అండ్ నెట్‌వర్క్ సిస్టం ఆధారంగా 2018 జనవరి 1 నుంచి అన్ని పోలీస్ కార్యకలాపాలను డిజిటలైజ్ చేసిన రాష్ట్రం?
ఎ) ఆంధ్రప్రదేశ్ బి) గోవా సి) గుజరాత్ డి) ఒడిశా

26. 2017 డిసెంబర్ 27న రాష్ట్రపతి రాంనాథ్ కోవింద్ ఏ రాష్ట్రానికి చెందిన ఫైబర్ నెట్ ప్రాజెక్టును ప్రారంభించారు?
ఎ) మధ్యప్రదేశ్ బి) ఆంధ్రప్రదేశ్
సి) బీహార్ డి) తెలంగాణ

27. 2018 జనవరి 1న తెలంగాణ పోలీస్‌శాఖ ప్రవేశపెట్టిన 'TSCOP' యాప్ ద్వారా ఎన్ని రకాల సేవలు అందుబాటులోకి రానున్నాయి?
ఎ) 100 బి) 63 సి) 44 డి) 54

28. సాయుధ బలగాల ప్రత్యేక అధికారాల చట్టాన్ని ఇటీవల ఏ రాష్ట్రంలో ఆరు నెలల పాటు పొడిగించారు?
ఎ) త్రిపుర బి) నాగాలాండ్
సి) మణిపూర్ డి) మేఘాలయ

29. పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో 700 మెగావాట్ల లక్ష్యంతో పాకిస్తాన్ ప్రభుత్వం 'ఆజాద్ పట్టాన్ జల విద్యుత్ కేంద్రం'ను ఏ నదిపై నిర్మిస్తోంది?
ఎ) సింధు నది బి) జీలం నది
సి) స్వాత్ నది డి) కున్హర్ నది

30. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎకనామిక్స్ 2017కి గాను వెలువరించిన 'శాంతి అనుకూల సూచి'లో భారత ర్యాంక్?
ఎ) 90 బి) 163
సి) 106 డి) 123



31. ఆంధ్రప్రదేశ్ నూతన డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్(డిజిపి)?
ఎ) నండూరి సాంబశివరావు
బి) గౌతం సవాంగ్
సి) మాల కొండయ్య
డి) అరవిందరావు



ఎస్.మహిపాల్‌రెడ్డి
సీనియర్ ఫ్యాకల్టీ

32. లైబీరియా నూతన అధ్యక్షుడు?
ఎ) జార్జి వా
బి) చార్లెస్ టేలర్
సి) ఎలెన్ జాన్సన్ సర్లీఫ్
డి) విలియం ట్యుబ్‌మన్

33. కేర్‌రేటింగ్స్(క్రెడిట్ రేటింగ్స్ అండ్ రీసెర్చ్)-2017 నివేదిక ప్రకారం ప్రపంచంలో అత్యధిక నిరర్థక ఆస్తులు కలిగిన దేశం గ్రీసు, కాగా భారత్ ర్యాంక్?
ఎ) 18 బి) 35
సి) 14 డి) 5

34. దేశ చరిత్రలో తొలిసారి ప్రపంచ చెస్ టోర్నీకి ఆతిథ్యం ఇవ్వడం ద్వారా ప్రాముఖ్యం పొందిన దేశం?
ఎ) లిబియా బి) ఖతార్
సి) సౌదీ అరేబియా డి) ఘనా

35. 2018 జనవరి 1 నుంచి VAT(వాల్యూ ఆడెడ్ ట్యాక్స్)ను ప్రవేశపెట్టిన దేశాలు?
ఎ) సౌదీ అరేబియా, యుఎఇ బి) కెన్యా, దక్షిణాఫ్రికా
సి) గ్రీసు, వెనిజులా డి) ఇథియోపియా, గ్రీసు

36. 2017 డిసెంబర్ 26న భారత్ ఏ దేశానికి 1 మిలియన్ డాలర్ల మానవతాపరమైన వైద్య సహాయం అందించాలని నిర్ణయించింది?
ఎ) గ్రీసు బి) యెమన్
సి) మయన్మార్ డి) శ్రీలంక

37. జింబాబ్వే నూతన ఉపాధ్యక్షుడు?
ఎ) అబ్దుల్లాహి ఫర్మాజో బి) ఒమర్-అల్-బషీర్
సి) సెబాస్టియన్ పినెరా డి) కాన్‌స్టాంటిన్ చివేగా

38. మాలి నూతన ప్రధాని?
ఎ) ఇబ్రహిం కేయిత బి) బౌబయ్ మైగా
సి) మిచెల్లి బాచ్‌లెట్ డి) సెబాస్టియన్ పినెరా

సమాధానాలు

1) సి	9) ఎ	17) బి	25) డి	33) డి
2) ఎ	10) బి	18) బి	26) బి	34) సి
3) సి	11) డి	19) ఎ	27) డి	35) ఎ
4) బి	12) బి	20) బి	28) బి	36) బి
5) డి	13) సి	21) ఎ	29) బి	37) డి
6) డి	14) బి	22) డి	30) ఎ	38) బి
7) ఎ	15) ఎ	23) సి	31) సి	
8) బి	16) బి	24) సి	32) ఎ	

నోటిఫికేషన్స్

సెంటర్ ఫర్ ఎయిర్‌బోర్న్ సిస్టమ్స్

బెంగళూరులోని డిఆర్‌డిఒ-సెంటర్ ఫర్ ఎయిర్‌బోర్న్ సిస్టమ్స్ జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్ భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
జూనియర్ రీసెర్చ్ ఫెలో: 15
విభాగాలు:ఏరోడైనమిక్స్, స్ట్రక్చరల్ డిజైన్ అనాలసిస్, రాడార్ ఇంజనీరింగ్, కమ్యూనికేషన్ ఇంజనీరింగ్, నెట్‌వర్కింగ్ & డిస్‌ప్లే సిస్టమ్స్, మిషన్ కంప్యూటర్, థర్మల్ మేనేజ్‌మెంట్.
అర్హత:బిఇ/బిటెక్/ఎంఇ/ఎంటెక్(ఎలక్ట్రానిక్స్/ఇసిఇ/ఎలక్ట్రికల్ ఇన్‌స్ట్రుమెంటేషన్/ఇఇఇ/సిఎస్‌ఇ/ ఇన్ఫర్మేషన్ సైన్స్/ఏరోనాటిక్స్/మెకానికల్ ఇంజనీరింగ్). నెట్/గేట్ అర్హత ఉండాలి.
వయోపరిమితి: 28 సంవత్సరాలు మించకూడదు
ఫెలోషిప్: రూ.25,000 **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్
ఎంపిక: ఇంటర్వ్యూ ద్వారా **చివరి తేదీ:** 2018 జనవరి 19
చిరునామా: The Director, Centre for Airborne Systems (CABS), DRDO, Ministry of Defence, Belur, Yemlur PO., Bengaluru - 560 037.
వెబ్‌సైట్: https://www.drdo.gov.in

టిఫర్ విఎస్‌ఆర్‌పి-2018

ముంబైలోని టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రీసెర్చ్(టిఫర్) సమ్మర్ ప్రోగ్రాంలో రీసెర్చ్ కోసం దరఖాస్తులు కోరుతోంది.
ప్రోగ్రాం: విజిటింగ్ స్టూడెంట్స్ రీసెర్చ్ ప్రోగ్రాం
కాల వ్యవధి: 2018 మే 7 నుంచి జూలై 4 వరకు
స్టయిపెండ్: నెలకు రూ.7000
అర్హత: ఆయా కోర్సుల్లో ప్రస్తుతం చదువుతున్న డిగ్రీ లేదా పీజీ విద్యార్థులు
ఎంపిక: అకడమిక్ మెరిట్, రైటప్, రిఫరీ నివేదిక ఆధారంగా **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్
చివరి తేదీ: 2018 ఫిబ్రవరి 28
వెబ్‌సైట్: http://www.tifr.res.in

ఎన్ఐపిజిఆర్


న్యూఢిల్లీలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్లాంట్ జీనోమ్ రీసెర్చ్ సీనియర్ రీసెర్చ్ ఫెలో భర్తీకి దరఖాస్తు కోరుతోంది.
సీనియర్ రీసెర్చ్ ఫెలో:01
అర్హత: ఎమ్మెస్సీ(లైఫ్ సైన్సెస్/బయో టెక్నాలజీ/ బయో ఇన్ఫర్మాటిక్స్/మాలిక్యులర్ బయాలజీ)
అనుభవం:సంబంధిత విభాగంలో రెండేళ్ల అనుభవం ఉండాలి. **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్
చివరి తేదీ: 2018 జనవరి 12
చిరునామా: Dr. Swarup Kumar Parida, Scientist, NIPGR. Aruna Asraf Ali Mrag, P.O. Box No. 10531, New Delhi - 110067.
వెబ్‌సైట్: http://www.nipgr.res.in/careers

Describe Darwin's theory of evolution

Heredity

1. What is a gene?

A. Gene is the unit of inheritance. Gene is the part of a chromosome which controls the appearance of a set of hereditary characteristics



2. What is meant by analogous organs? Taking a suitable example, explain how they support the theory of Organic Evolution.

A. Analogous organs are those organs which I have different basic structural design and developmental origin but have similar appearance and perform similar functions.



Example: The wings of birds and bats look similar but have different design in their structure. They have a common function of flying but their origins are not common.
So, birds and bats are not closely related.

3. What is a sex chromosome?

A. Sex chromosome is a chromosome that operates in the sex-determining mechanism of a species. Many animals have two different types of sex chromosomes. For example, in human there is a large X chromosome and a much smaller Y chromosome.

4. Define 'evolution'. Describe Darwin's theory of evolution.

A. Evolution is the sequence of gradual changes which take place in the primitive organisms over millions of years and new species are produced. Since, the evolution is of the living organisms, so it is called 'Organic Evolution'.
Darwin's theory of Evolution: Charles Robert Darwin gave the theory of evolution in his famous book, 'The Origin of Species'. The theory of evolution proposed by Darwin is known as 'The Theory of Natural Selection'. It is also called 'Darwinism'.
According to Darwin's theory of evolution: There is natural variation within any population and some individuals have more favourable variations than others.
1.Population remains fairly constant even though all species produce a large number of off springs.
2. This is due to 'competition' or struggle for existence between same and different species.
